# ప్రజాశక్తి

Vol. 3, no. 19

(Nov. 10, 1943)

బెజవాడ, 1943

Prajāśakti

Vol. 3, no. 19

(Nov. 10, 1943)

Bejavāḍa, 1943

Record no. 683

0-2-0 సోవియట్ విప్లవ సంచిక Regd. No. M. 4486

# ప్రజాశక్తి

భారత కమ్యూనిస్టుపార్టీ, ఆంధ్రకమిటీ పత్రిక

| | | | |
|---|---|---|---|
| సంపుటి 3<br>సంచిక 19 | : సంపాదకవర్గం :<br>మద్దుకూరి చంద్రశేఖరరావు (సం)<br>కంభంపాటి సత్యనారాయణ | పుచ్చలపల్లి సుందరయ్య<br>తుమ్మల వెంకటరామయ్య<br>చలసాని వాసుదేవరావు | బుధవారం<br>10-11-43 |



309 నాజీ నరహంతకులను హతమార్చిన సోవియట్ వీరవనిత లూడ్‌మిల్లా

# "నాజీ ఆక్రమిత దేశాలకు చెర తప్పే సుదినం సమీపించింది"

—స్టాలిన్



సోవియట్ ప్రజలకు, ప్రపంచ స్వాతంత్ర్య కాములకు, రెడార్మీ నవంబరు దే కానుకను ప్రసాదించింది - ఉక్రైన్ రాజధాని కీవ్ విముక్తి సాధించింది. విప్లవవార్షికోత్సవాలకు, విజయకోలాహలం తోడయి, సోవియట్ రాజ్యమంతా ఆనందం వెల్లివిరిసింది.

ఆ ఆనంద సమయంలో కామ్రేడ్ స్టాలిన్ గంభీర స్వరం గాలిలో తేలి వచ్చింది - ఎక్కడి వారక్కడ మంత్రబద్ధు లయినట్లు నిల్చొని, కామ్రేడ్ స్టాలిన్ నవంబరు దే గంభీరోపన్యాసంవిన్నారు. గడచిన సంవత్సరాన్ని సింహావలోకనంచేస్తూ, ముందు కర్తవ్యాన్ని గురించి హెచ్చరిస్తూ - కామ్రేడ్ స్టాలిన్ ఉపన్యాసం ఎంతో ఉత్తేజపరచింది.

## వేసవిలోకూడా మనదే పైచేయి

"మనం విజయాలు సాధించడం ప్రారంభించిన దగ్గరనుంచి శత్రువు ఒక్క విజయాన్నయినా సంపాదించలేక పోయాడు. గడచిన సంవత్సరం నిజంగా చాల ప్రధానమైనది. ఆ సంవత్సరంలో మన వేసవి దండయాత్ర ప్రారంభమయింది. శత్రువు తన సేనల్ని మన చక్రవ్యూహంలో చిక్కనీయకుండా తప్పించుకోడానికి ప్రయత్నించి, విశాల ప్రదేశాలను, అపార యుద్ధ సామగ్రిని, విడిచిపెట్టి పారిపోసాగాడు. ఇలా పారిపోతున్న శత్రువును విధివిరామము లేకుండా వెన్నంటి తరుముతూ మనం దండయాత్రను కొనసాగిస్తూ వచ్చాం.

"ఒక్క శీతాకాలంలోనే కాదు. వేసవిలో కూడా మనం శత్రుమూకల్ని చితుకగొట్టగలమనే విషయాన్ని గడచినసంవత్సరం రుజువు చేసింది. ఇప్పుడు రెడార్మీ నీపర్ నది అవతలి గట్టుమీద శత్రుసేనల్ని చల్లాచెదరుచేస్తూంది.

"ప్రారంభంలో జర్మన్లకు కావలసినన్ని సేనా సమూహాలుండేవి. కాని, ఇప్పుడవి చాలవరకు క్షీణించిపోయాయి. జర్మన్లు సర్వ సమీకరణ గావించారు. కాని, వాళ్ళ శక్తి కన్నా మన శక్తే పెరుగుతూ వచ్చింది. ఈ విషయంకూడా గడచిన సంవత్సరం రుజువయింది.

## శత్రుమూకల పలాయనం

"ఈ సంవత్సర కాలంలోనూ శత్రువు ఎంతగింజుకున్నా, చెప్పదగిన విజయాన్ని ఒక్కటికూడా సాధించలేకపోయాడు. మన సేనలు జరిపిన వేసవి విజృంభణ ముందు జర్మను ఫాసిస్టు మూకలు పలాయన మంత్రం పఠించారు; ఆక్రమించుకొన్న విశాల ప్రదేశాలను విడచిపెట్టి పోయారు. నిలుచుంటే ప్రాణాలు దక్కవేమో అనే స్థితిలో పడి శత్రు సేనలు పారిపోతూ, యుద్ధ సామగ్రినే కాకుండా, తమలో గాయపడినవారిని కూడా విడిచిపెట్టి పోయాయి.

"గతసంవత్సరం ప్రారంభమైన శీతకాల దండయాత్రే ఈవిధంగా వేసవి విజృంభణగా కొనసాగింది. ఇలా జరగడం ఇదే మొదటి సారి. ఈవిషయాన్ని ప్రపంచానికి ప్రదర్శించిన గత సంవత్సరం చరిత్రాత్మకమైనది. రెడార్మీ వేసవి దండయాత్ర సాగించలేదనే పుక్కిటి పురాణానికిక తావులేదు.

## ఒక సంవత్సరంలో

"ఈ వేసవి దండయాత్రలో శత్రువుకి చాల గట్టి దెబ్బలు తగిలాయి. ఒక్కమధ్యరంగంలోనేమన సేనలు 750 మైళ్ళు ముందుకు పోయాయి. పది లక్షల చదరపుకిలోమీటర్ల (ఒక కిలోమీటరు, 5 ఫర్లాంగులతో సమానం) సోవియట్ భూభాగాన్ని శత్రు చెరనుండి విముక్తి పరచాయి. దక్షిణంలో స్టాలిన్‌గ్రాడ్ నుంచి ఖెర్సన్ వరకు పురోగమించాయి.

"గడచిన 12 మాసాల్లోని ఘటనలు ఒక విషయాన్ని రుజువు చేస్తున్నాయి. అదివరకుక్షీణించిపోయిన తమ సేనల్ని జర్మన్లు కొత్త సైనికులను తెచ్చి మరామత్తు చేశారు. అంత మాత్రంచేత, పోగొట్టుకున్న యుద్ధకౌశల్యాన్ని వారు తిరిగి కోలుకోలేరని ఈ 12 నెలలు నిరూపించాయి. స్టాలిన్‌గ్రాడ్ దగ్గర తిన్న దెబ్బనుండి జర్మన్లు ఇంతవరకు తెప్పరిల్లుకోలేదు. స్టాలిన్‌గ్రాడ్ యుద్ధం జర్మన్ల అంతిమ పరాజయాన్ని ఖాయపరచింది: కుర్‌స్కు యుద్ధం వారి స్థితిని మరింత విషమంచేసింది. పోగొట్టుకున్నదాన్ని తిరిగి కోలుకోగలమని, ఆవిధంగా యూరప్‌లో తమ పరపతిని తిరిగి ప్రతిష్ఠించుకోగలమని జర్మన్లు వెర్రికలలు కన్నారు. ఈ కలలనన్నిటినీ రెడార్మీ కల్లలుచేసింది.

"గడచిన సంవత్సరంలో జర్మన్లు 40 లక్షల మంది సైనికుల్ని నష్టపోయారు. వీరిలో చనిపోయినవారే 18 లక్షలు. 25 వేల టాంకుల్ని, 40 వేలఫిరంగుల్నికూడా జర్మన్లు నష్టపోయారు. ఫాసిస్టు సేనకు మునుపటి స్వరూపం మరి లేదు.

## రెడార్మీ విజయాలు, ప్రజా విజయాలు

"రెడార్మీ విజయాలు, సోవియట్ ప్రజల అద్భుత కృషి, అన్యోన్యంగా పెనవేసుకొని ఉన్నాయి. అంతేకాదు. రెడార్మీ విజయాలు ప్రజలకృషిపై ఆధారపడున్నాయికూడ. ఈ యుద్ధం ప్రారంభమయింది మొదలుకొని మన పరిశ్రమలన్నీ ఉత్పత్తిని పెంచుతూవచ్చాయి. మన పరిశ్రమల్ని తూర్పు ప్రాంతాలకు మార్చడమే కాకుండా, ఉత్పత్తిని పెంచాం. రెడార్మీకి మొదటి నుంచీ కూడా కావలసినంతగ వేలకొలది టాంకుల్ని, ఇతర ఆయుధాల్ని వెనుకనున్న కార్మికులు అందిస్తూ వచ్చారు. సోషలిస్టు ఆర్థికవ్యవస్థ ఈ విధంగా పుత్పత్తిని వృద్ధిచేసి యోధుల్ని ఎందరినో సృష్టించింది. టాంకుల్లోను, విమానాల్లోను సంఖ్యాబలం తమదేనని జర్మన్లు ఒకప్పుడు జబ్బ చరుచుకునేవారు. ఇప్పుడా ఆధిక్యత అంతరించింది. శాంతి సమయంలో మన పల్లెల, పట్టణాల ఉత్పత్తి విషయంలో మన పల్లె ప్రజలు వీరోచిత విజయాలు సాధించారు. అతి ప్రధానమైన వ్యవసాయక్షేత్రాలుశత్రువశమయిపోయినప్పటికీ, రెడార్మీకి, దేశంలోనున్న ప్రజలకు, ఆహార పదార్థాల కరువు రానీయకుండాను, మన పరిశ్రమలకు ముడిపదార్థాల కొరత లేకుండాను, మన పల్లె సోదరులు కాపాడారు.

"ఈ యుద్ధ జ్వాలల్లోంచి సోవియట్ రాజ్యాంగం మునుపటికన్నా చక్కగా ఆరితేరి, మునుపటికన్నా బలీయమై, బయటపడగలదు.

## మరచిపోము !

"తోకముడిచి పారిపోతూన్న శత్రువు తన చేతిలోఉన్న ప్రదేశాలను సోవియట్ స్మశానాలుగచేసేస్తున్నాడు. ఈఘాతుకాన్ని సోవియట్ ప్రజలు క్షమింపరు. మన రాజ్యాంగాన్ని కూలద్రోయడానికి శత్రువు ప్రయత్నించాడు. దీనినీ మన ప్రజలు (మిగతా 12 వ పేజీ)

విధి విరామం లేకుండా శత్రువును వెన్నంటి తరుముతూన్న రెడార్మీ



బుధవారం ప్రజాశక్తి 10-11-43

## మాస్కో ఒడంబడిక

సోవియట్ ప్రజలు, ఎర్రసైన్యం, నాజీ దురంతకులను తమ మాతృభూమినుండి పారదోలుతున్నారు. 26 వ సోవియట్ విప్లవదినోత్సవానికి కానుకగా యుక్రెయిన్ రాజధానిఅయిన కీవ్ నగరాన్ని ఎర్రసైన్యం స్వాధీనంచేసికొంది. గతఏడాదిలోనూ మధ్యరంగంలో జర్మన్లను 750 మైళ్ళు వెనక్కి తరిమింది. దక్షిణరంగంలో స్టాలిన్‌గ్రాడ్ మొదలుకొని ఖెర్సన్ వరకు తరిమికొట్టింది. అనగా సుమారు 4 లక్షల చదరపుమైళ్ళ సోవియట్ భూమి నాజీరాక్షసులచేతుల్లోనుండి విముక్తిచేయబడింది. నాజీ ఆక్రమిత దేశాలలో ప్రజలు తమతమదేశాలనుండి శత్రువును పారద్రోలడానికి గెరిల్లా యుద్ధాలు చేస్తున్నారు. అమెరికా – బ్రిటన్ ప్రజలు, మిత్రరాజ్యాల ప్రజలందరు, హిట్లరును త్వరగా తుదముట్టించడానికి రెండోరంగం తెరవాలని తమప్రభుత్వాలపై ఒత్తిడిచేస్తున్నారు. వీటన్నిటి ఫలితంగానే అమెరికన్, బ్రిటిష్ విదేశాంగమంత్రులయిన కార్డెల్‌హల్, ఈడెన్, మాస్కో వెళ్లారు. సోవియట్‌తో సంప్రదించి, మిత్రరాజ్యాల భవిష్యత్ ప్లానులను గురించి ఒడంబడిక చేసికొన్నారు. ఈ సమావేశానంతరం చేసిన ప్రకటనలో చైనా ప్రతినిధి సంతకంచేశాడు. అనగా జర్మనీ, జపాను ఫాసిస్టుల బానిసత్వంక్రింద వున్న దేశాలన్నిటికీ యిది వర్తించుతుంది.

సంధి నిర్ణయాలను గమనించితే, సోవియట్ మిలిటరీ పత్రిక "రెడ్‌స్టార్" వ్రాసినట్లు "సాధ్యమైనంత త్వరగా శత్రువును నాశనం చేయాలని ఆశించుతున్న సోవియట్ ప్రజల, ప్రపంచప్రజల, కోర్కెల" కనుగుణ్యమయిన నిర్ణయం జరిగింది. "ఇజ్‌వెస్టియా" యీ విధంగా వివరించింది. "ఈ సభ ఏవిధమైన మిలిటరీ చర్యలను తీసికోవాలో నిర్ణయించింది. వాటిని అమలుజరుపడానికి సన్నాహాలు ప్రారంభమయ్యాయి." మార్షల్ స్టాలిన్ నవంబరు 6 ఉపన్యాసం కూడ విజయం త్వరలోనే సాధించగలమని స్పష్టపరచింది. కామ్రేడ్ స్టాలిన్ సోవియట్ భూమినంతను విముక్తి చేయడమే గాకుండా, హిట్లరు పాదాలక్రింద నలిగిపోతున్న ప్రజలందరిని విముక్తిచేసి, స్వాతంత్ర్యాన్ని స్థాపించాలని కూడా నొక్కి చెప్పాడు.

యుద్ధానంతర సమస్యల విషయంలో కూడ మూడురాజ్యాలు కలిసి పనిచేయడానికి కొన్నినిర్ణయాలు చేయబడ్డాయి. వీనిలో కూడ సోవియట్ రాజనీతి యెలా జయించుతోందీ స్పష్టంగా కన్పించుతుంది. శత్రువు ఎట్టి షరతులు లేకుండా లొంగిపోయేవరకు యుద్ధం సాగించుతామనీ, యుద్ధానంతరం ప్రపంచ శాంతి భద్రితల రక్షణకోసం మూడురాజ్యాలు కలసి పనిచేస్తామనీ, ప్రకటించాయి. శాంతిని స్థాపించిన తరువాత ఏప్రభుత్వమూ తక్కినవాటితో సంప్రతించకుండా యితరదేశాలపైకి తన సైన్యాలను పంపము అనీ, హామీఇవ్వబడింది. ఇది విముక్తిపొందినదేశాలలో ప్రజలు తమ కిష్టమొచ్చిన ప్రభుత్వాలను స్థాపించుకోవచ్చు ననడానికి గ్యారంటీవంటిది.

ఇటలీలో ప్రజాస్వామిక ప్రభుత్వం ఏర్పరిచాలనీ, దానిలో ఫాసిస్టు వ్యతిరేకులకు ముఖ్యస్థానం వుండాలని అంగీకరించారు. ఫాసిస్టు వ్యతిరేక రాజకీయ సంస్థలన్నిటికి పౌరసత్వహక్కు లివ్వాలని నిర్ణయించబడింది. ఫాసిస్టుఅనుకూలసంస్థలు, నిర్మాణాలు వెంటనే రద్దుచేయబడాలని స్పష్టపరచింది. ఫాసిస్టు వ్యతిరేక ఖైదీలందరినీ విడుదలచేసి, స్థానికస్వపరిపాలనను వెంటనే ప్రవేశపెట్టాలని నిర్ణయించబడింది. ఫాసిస్టు నాయకులను అరెస్టుచేసి, వారి క్రూరచర్యలకుగాను విచారణ పెట్టాలని నిర్ణయించబడింది. అనగా ఇటలీలో సంపూర్ణప్రజాప్రభుత్వం ఏర్పరచడానికి అవకాశాలు కలిగించబడ్డాయి.

జర్మన్ దురాక్రమణకు తొలిబలి అయిన ఆస్ట్రియాకు సంపూర్ణమయిన ఆర్థిక–రాజకీయ స్వాతంత్ర్యం వాగ్దానం చేయబడింది. హిట్లరును కూలద్రోయడానికి ఆస్ట్రియా ప్రజల సహకారం అర్థించబడింది. నాజీదురంతకులు వివిధ దేశాలలో ఒనర్చిన ఘోరనేరాలకుగాను శిక్షింపబడుతారని స్పష్టపరచింది. ఏదేశంలో నేరం చేసిన క్రూరులను ఆదేశప్రజలకు పట్టి ఒప్పగించుతామని తేటతెల్లంచేసింది. ప్రపంచంలో ఎచ్చట దాగినా, యీక్రూరులను వదలమనీ, నేరాలకు తగిన శాస్తి చేస్తామనీ, ఖచ్చితంగా తెలిపింది. ముఖ్యులయిన నాజీ నాయకులను మిత్రరాజ్యాలు సమిష్టి నిర్ణయం ప్రకారం శిక్షిస్తామని తెలిపింది.

ఈ విధంగా మాస్కో ఒడంబడిక మిత్రరాజ్యాల ఐక్యతను రుజువు చేసింది. ప్రపంచప్రజల ఆశయాలదే పైచేయి అయినట్లు పై నిర్ణయాలన్నీ స్పష్టపరుస్తున్నాయి. వీటినే విపులపరుస్తూ కామ్రేడ్ స్టాలిన్ మిత్రరాజ్యాల కర్తవ్యాలను యిలా వివరించాడు. "(1) హిట్లరు బానిసత్వాన్నుంచి యూరప్ ప్రజలను రక్షించడం (2) విముక్తి చేయబడిన ప్రజలకు తమ యిష్టమైన ప్రభుత్వాలను స్థాపించుకోడానికి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలివ్వడం, (3) యుద్ధానికి, దురంతాలకు కారకులైనవారిని కఠినంగా శిక్షించడం, (4) యూరపులో తిరిగి జర్మన్ దురాక్రమణ సాధ్యంగాకుండా కట్టుదిట్టాలు చేయడం, (5) జర్మనీ బానిసత్వంలో నష్టపడిన ప్రాంతాలను పునరుద్ధరించడానికి ప్రజలమధ్య సహకారాన్ని స్థాపించడం." ఈ ఆశయాలను అమలు జరపడానికి సోవియట్ హామీగా నిలబడివుంది. ప్రపంచప్రజలం మనకర్తవ్యాన్ని నిర్వహిస్తూ, ఫాసిజాన్ని నాశనం చేయుటకు చేయూతనిస్తే, నూతన నాగరికతకు పై ఆశయాలు పునాదులవుతాయి. 26 వ సోవియట్ విప్లవదినోత్సవ సందర్భంలో అందుకు తగిన కృషి చేస్తామని ప్రతిన బూనుదాం.

★ మనరాజకీయాలు

## పార్లమెంటులో బెంగాల్ కరువుపై చర్చ

— కంభంపాటి సత్యనారాయణ

ప్రతిరోజూ బెంగాల్ కరువును గురించి వచ్చే వార్తలవల్ల బ్రిటిష్‌ప్రజలలో ప్రజ్వరిల్లుతున్న అసంతృప్తి జ్వాలల ఫలితంగా మొన్న 4 వ తేదీని బ్రిటిష్ పార్లమెంటు సమావేశపరచబడింది. ఫ్రెడరిక్ లారెన్సు (లేబర్) చర్చను ప్రారంభిస్తూ, ప్రభుత్వ విధానాన్ని తీవ్రంగా విమర్శించాడు. "ఇంతవరకు జరిగిన సంఘటనలకు బాధ్యత ఇక్కడ, ఇండియాలోను, అధికారవర్గంలో ఉన్నవారందరిదీ" అన్నాడు. కరువు నివారణకై అమెరీ తీసుకున్న చర్యలన్నీ విఫలమయాయంటే, అందులో సిగ్గుపడవలసిన విషయం ఏమీలేదని అమెరీ తప్ప మరెవరూ–బ్రిటిష్ ప్రజాసామాన్యంగాని, అమెరికన్లుగాని, తానుగాని–భావించడంలేదన్నాడు. ఇతర దేశాలనుండి ఇండియాకు ఎక్కువగా ఆహార పదార్థాలు పంపి, దేశం అంతటా రేషనింగ్ ప్రకారం ప్రజ లందరికీ ఆహారం సప్లయి చేయాలని సూచించాడు. ప్రజలకు సహాయం చేయడానికీ, కరువుపరిస్థితుల్ని తొలగించడానికీ, ప్రభుత్వం భారతీయులందరి సహకారం తీసుకోవాలని హెచ్చరించాడు. కరువువల్ల యేర్పడే ఫలితాలు యుద్ధంలో సంభవించు ఓటమితో సమానం అని తెలియజేశాడు.

### అమెరీ యిచ్చిన సంజాయిషీ

దీనికి ప్రభుత్వం తరఫున ఇండియా మంత్రి అమెరీ జవాబిస్తూ, "మన సామ్రాజ్యంలో నివసించే స్త్రీలు, పురుషులు, సోదర పౌరులు, పడే బాధలకు మన మంతా ఆందోళన చెందుతున్నాం. ప్రమాదావస్థలో ఉన్న వీరందరికీ మనం సర్వశక్తులు వినియోగించి సాయం చేయాలి" అన్నాడు. ఇదివరకు మాదిరిగా, బెంగాల్ కరువుకు బాధ్యత బెంగాల్ మంత్రి వర్గానిదేనంటూ యీసారి మొండిజవాబు చెప్పలేక పోయాడు. ఇండియా యొక్క ఆర్థిక నిర్మాణంలోనే లోపం అంతా ఉన్నదని సంజాయిషీ చెప్పబోయాడు. ఎక్కువమందికి వ్యవసాయమే ప్రధానవృత్తి కావడంవల్ల, రైతుకు కుటుంబ ఖర్చు పోగా మిగిలేది బహు తక్కువ అనీ, దాని మీదే పట్టణాలలో నివసించే జనాభా అంతా ఆధారపడి యుందనీ, యిందువల్ల కరువు ఏర్పడిందనీ, అమెరీ వాదన. దీనికితోడు ఇండియాలో యుద్ధ పరిశ్రమలకే ఎక్కువ ధనం ఖర్చుపెట్టి, జీవితావసర వస్తువుల ఉత్పత్తికి తక్కువ ఖర్చు పెట్టడంవల్ల అన్ని వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయన్నాడు. "150 సంవత్సరాల బ్రిటిష్ పరిపాలన దేశం యొక్క ఆర్థిక నిర్మాణాన్ని యింత చక్కని స్థితికి తీసుకొచ్చిందా?" అని పలువురు సభ్యులు అమెరీని ఆక్షేపించారు. ఆహార సమస్యను పరిష్కరించుటకై కేంద్రప్రభుత్వం తనకున్న ప్రత్యేకాధికారాల్ని వినియోగించి, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలపై ఎందుకు చర్య తీసుకోలేదంటే, అందు కవసరమై పరిపాలనా యంత్రంగాని, తరిఫీదు పొందిన నిపుణులుగాని, లేరట! అమెరీ యిచ్చిన యీ డొంక తిరుగుడు సమాధానం ఎవరినీ సంతృప్తిపరచలేదు గత 6 మాసాలలో బెంగాల్‌కు ఇండియా ప్రభుత్వంద్వారా 3 లక్షల 75 వేల టన్నులు, స్వేచ్ఛావ్యాపారంలో 1 లక్ష టన్నుల బియ్యం లభించాయట. ఇతర విధాల మరో 3 లక్షల టన్నులు లభించనున్నాయట! సప్లయిల విషయంలో ఆందోళన అనవసరమట! పంపకంవిషయంలోనే గట్టి శ్రద్ధతీసుకోవాలట! అమెరీ ఇంత ధైర్యంతో మాటలు చెబుతూంటే, బెంగాల్‌లో ప్రతిరోజూ కరువువల్ల, అంటువ్యాధులవల్ల, చనిపోయేవారిసంఖ్య తగ్గదేమి? అనే ప్రశ్నకు అమెరీ జవాబు చెప్పలేదు. చెప్పడానికి ఏమైనా ఉంటేగా!

### యుద్ధకృషి కుంటుపడుతుందట!

ఆహారపదార్థాలతో ఎక్కువ ఓడలను ఇండియాకు పంపితే, యుద్ధావసరాలకు ఓడల సప్లయి తగ్గి, యుద్ధకృషి కుంటుపడుతుందని అమెరీ వాదించబోయాడు. కాని, వెంటనే సోరెన్సన్ (లేబర్) లేచి, "యీమధ్య ఇంగ్లండుకు కెనడా – ఆస్ట్రేలియాలనుండి ఆహారపదార్థాలతో వచ్చిన ఓడలను ఇండియాకే ఎందుకు మరల్చలేదు?" అని ప్రశ్నించాడు. సూటియైన యీప్రశ్న అమెరీగొంతుకలో పచ్చివెలక్కాయలా పట్టుకుంది. జవాబేమీ చెప్పలేకపోయాడు.

అమెరీ ఇచ్చిన సంజాయిషీ పార్లమెంటు సభ్యుల్ని సంతృప్తిపరచలేదు. యుద్ధం ప్రారంభమై నాలుగుసంవత్సరాలయినా, ఆహారసమస్యను పరిష్కరించడానికి యెట్టి ప్లానులేనట్లు స్పష్టమయిందని సర్ జార్జి షూస్టర్ (లిబరల్ నేషనల్) విమర్శించాడు. ఆహారపదార్థాలను తక్షణమేపంపాలని హెచ్చరించాడు. కాంగ్రెసు నాయకుల్ని విడుదలచేసి, రాజకీయ ప్రతిష్టంభనను తొలగించకపోతే, యీ సమస్యను పరిష్కరించడం అసాధ్యమని మిస్టర్ కవ్ (లేబర్) వాదించాడు. గాడ్‌ఫ్రీ నికల్సన్ వంటి కన్సర్వేటివ్ సభ్యుడు సహితం ఇలాఅన్నాడు: "భారతీయులలో ఒడంబడిక కుదరకపోయినంతమాత్రంచేత మనం ఊరుకోవచ్చునా? ధైర్యంతో మనం ఒకప్లానును అమలు పరచవద్దా? మన పరిపాలనా యంత్రం తలక్రిందులవడంవల్లనే గదా వేలకొద్దీ ప్రజలు కరువుకు ఆహుతి అయ్యారు? ఇది మన కెంతసిగ్గుచేటు!"

### చర్చ ఫలితం

మొత్తంమీద, యీ చర్చవల్ల తేలిన ఫలితం ఏమిటి? ఒకవైపు అమెరీ ముఠా, కేవలం మిలిటరీ సహాయంతోనే విజయం సాధించవచ్చుననీ, ప్రజల సహకారం, మనోనిబ్బరం, ధైర్య సాహసాలు, అంత ఎక్కువ అవసరం కాదనీ, భావిస్తున్నారు. మరొకవైపు అన్నిపార్టీల బ్రిటిష్ ప్రజా ప్రతినిధులు యీ పాలసీని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అమెరీ నియోజకవర్గంలోనే జరిగిన ఒక బహిరంగసభ అమెరీని తొలగించాలని తీర్మానించిందంటే, బ్రిటిష్ ప్రజల ఆందోళన ఎంత ఎక్కువగా ఉందో తెలుసుకోవచ్చు. సిబిల్‌థారన్ డైక్ అనే సుప్రసిద్ధ సినిమా తార ఒక లండన్ సభలో ఉపన్యసిస్తూ, యుద్ధ పరికరాలకు బదులు 6 ఓడలతో ఆహారపదార్థాలను ఇండియాకు పంపితే, ప్రపంచంలోని తుపాకులన్నీ కలసి చేయలేనంత పనిని చేయవచ్చునని పలికింది. బ్రిటిష్ ప్రభుత్వం బెంగాల్ కరువు సమస్యను పరిష్కరించడానికి యింతకంటె తీవ్రమైన చర్యతీసుకొనేటట్లు ఒత్తిడి తేవాలని "డెయిలీ హెరాల్డ్" వంటి మితవాద లేబర్‌పార్టీ పత్రిక సహితం బ్రిటిష్ ప్రజలకు హెచ్చరించుతోంది. కెనడా ప్రభుత్వం 1 లక్ష టన్నుల గోధుమలను పంపడానికి సంసిద్ధతను ప్రకటించింది. నేషనల్ కాంగ్రెస్ ఆఫ్ ఇండస్ట్రియల్ ఆర్గనైజేషన్సు అను అమెరికన్ ట్రేడ్ యూనియన్ సంస్థ తన నిధినుండి 1 లక్ష డాలర్లను (సుమారు 3! లక్షలరూపాయలు) కరువు నివారణకై (మిగతా 11 వ పేజీలో)



# సోవియట్ యూనియనుకి జోహారులు

★

## "అందరం ఏకమై అభివృద్ధి నిరోధకులను ఎదుర్కొందాం"



పామీదత్తు

26 ఏళ్ళ క్రితం (7-11-1917) రష్యన్ కార్మిక కర్షక వర్గాలు చరిత్రలో మొదటిసారి సోషలిస్టు విప్లవ విజయాన్ని సాధించాయి. అంతవరకు జారు చక్రవర్తి క్రింద అణగిపడి ఉండిన ఆసియా జాతులకు, ఇంకా ఇతర జాతులకు, ఆవిజయంతో విముక్తి కలిగింది. మానవ స్వాతంత్ర్యాభివృద్ధులకు ఆగర్భ శత్రువయిన ఫాసిజాన్ని నేడు సోషలిస్టు సోవియట్ యూనియన్ ఎదిరించి, ప్రపంచ ప్రజావిముక్తి పోరాటాన్ని నడుపుతూంది. రెడార్మీ నాజీ మూకల్ని చిదకగొడుతూ నిత్యనైవేద్యంగా సాధిస్తున్న విజయ పరంపరలు ప్రపంచ ప్రజల స్వాతంత్ర్యాన్ని త్వరితం చేస్తున్నాయి.

ఈ పరిస్థితుల్లో ఇండియా నేడొక విషాదఘట్టంలో ఉంది. ఆర్థికంగాను, రాజకీయంగాను అల్లకల్లోల స్థితిలో ఉంది. ఈ స్థితిలోంచి బయటపడి ముందుకుపోవాలంటే ఇండియాకు ఒకేఒక మార్గముంది. జాతీయైక్యతను సాధించి, ప్రపంచ ప్రజా స్వాతంత్ర్య సమరంలో పాల్గొనడం ఒక్కటేమార్గం. సోవియట్‌యూనియన్ చైనా, మిత్రరాజ్యాలు, ఫాసిజంపైసాధించే విజయాలతో ఇండియా స్వాతంత్ర్యం పెనవేసుకొని ఉందన్న విషయాన్ని చిత్తశుద్ధిగల భారతీయ దేశభక్తులందరూ గుర్తించారు.

బ్రిటన్‌లోని అభివృద్ధి కాములందరూ బ్రిటన్ - సోవియట్ ఒడంబడికను హృదయ పూర్వకంగా బలపరుస్తున్నారు. పడమటి యూరప్‌లో త్వరగా రెండవరంగం ప్రారంభించుట ద్వారా యుద్ధాన్ని తొందరగా ముగించడం కోసం సాయశక్తులా కృషిచేస్తున్నారు. భారతదేశంపట్ల ప్రభుత్వం తన వైఖరిని మార్చుకొనేలా చేయడానికి ఆందోళన చేస్తున్నారు.

నేడు నవంబరు విప్లవ 26వ వార్షికోత్సవం, ఈ శుభదినం మనల్ని ఉత్తేజితుల్ని చేయుగాక! ఉత్తేజితులమై మనం సోవియట్ ప్రజలతో భారత, బ్రిటిష్, ప్రజల సంఘీభావాన్ని, అచంచల సౌభ్రాతృత్వాన్ని స్థాపిద్దాం! అందరం ఏకమై అభివృద్ధి నిరోధక శక్తులనెదిరించి, విజయం సాధిద్దాం!!

## "మట్టిముద్దలోంచి మహావీరులను సృష్టించారు!"

"అహో వీరప్రజానీకమా! మా భారత ప్రజానాయకులు నేడు జైళ్ళలో మ్రగ్గుతున్నారు–స్వయంగా మీకు అభివందన సందేశాల నందజేయగల స్థితిలో వారు లేరు, ఆమహాభాగ్యం నాకు లభించింది.

26 ఏళ్ళక్రితం పాతరష్యా శిధిలమయి, నూతన రష్యా ఆవిర్భవించింది. ఎన్నో శ్రమతమాల కోర్చి మీ రీ మహోజ్వల విజయాన్ని సాధించారు. ఆవిజయంయొక్క 26 వ వార్షికోత్సవ సందర్భంలో భారతదేశం తరఫున మీ కివే కృతజ్ఞతాపూర్వక అభివందనాలు.

25 ఏళ్ళే గడచాయి. మీరు నూతన రష్యాను నిర్మించి. 25 ఏళ్లు-కాలచక్రం పరుగులో ఒక్కతృటికాలం! ఈస్వల్పకాలంలో అద్భుతమైన ఘనకార్యాలు సాధించారు. ఒకవైపు ఆశ్చర్యము, మరోవైపు గర్వము తొలుకాడ మీ అమోఘ కృషిని మేం కనిపెడుతూ వచ్చాము.

విచ్ఛిన్నమైపోతున్న ఒక సామ్రాజ్య శిధిలాలపై అద్భుతమయిన ఒక ప్రజాస్వామ్య ప్రపంచాన్ని మీరు నిర్మించారు. కన్నీటి కాల్వలతోను, రక్తధారలతోను, మీ రీ అద్భుతమైన నిర్మాణాన్ని సాగించారు. విజయ సాధనపట్ల చెక్కుచెదరని నమ్మకంతోను, భవిష్యత్తుపై గల అచంచల విశ్వాసంతోను యీ నిర్మాణాన్ని కొనసాగించారు. రైతును నికృష్ట దశనుండి తొలగించి, స్వాతంత్ర్య రథంలో కూర్చోబెట్టారు. ప్రజానీకాన్నంతటినీ నిరంకుశ ప్రభువులు రూపులేని ఒకమట్టి ముద్దగ నలగదొక్కేశారు ఆమట్టిముద్దలోనుంచే మీరు నేడు లక్షలకొలది వీరాధివీరులను సృష్టించారు; ప్రపంచ నాగరికతను, స్వాతంత్ర్యాన్ని, కాపాడగల సంరక్షకులను ప్రసాదించారు!



శ్రీమతి సరోజినీదేవి

మా భారతదేశం స్వాతంత్ర్య సంపాదన కోసం పడరాని పాట్లు పడుతూంది. ఇంకా యెన్నో దేశాలు యీ ఆవేదనను అనుభవిస్తున్నాయి. మా కందరకు మీఆదర్శము ఆరని ఆశాజ్యోతి. ఓ సోవియట్ ప్రజానీకమా! ఇవే మీకు మా జోహారులు! మా ప్రేమాభివందన కానుక లివిగో!"

## "మానవుని భావసంపద వికసించే అవకాశం కలిగించారు"

★

"మీ దేశంలో ప్రజలకు శాస్త్రీయ పద్ధతుల పైని విద్య నేర్పుతున్నారు. అంతేకాదు. ప్రతి పౌరుణ్ని నిర్మాణ శక్తులతో కూడుకొన్న వ్యక్తిగా తరిఫీదు చేస్తున్నారు. మానవ జాతి ఆశయాలన్నిటిలోను ఉత్తమోత్తమమైనదాన్ని మీరీవిధంగా సాధిస్తున్నారు.

మానవుని మేధస్సులో దాగిఉన్న భావ సంపద కంతటికీ స్వేచ్ఛగా వికసించగల అవకాశాన్ని చరిత్రలో మొట్టమొదటిసారి మీరు కలిగించారు. ఇందుకు మీకివే నా హృదయ పూర్వక వందనాలు" (మాస్కోలో టాగూర్.)



రవీంద్రనాథ టాగూర్

## "లెనిన్ వంటి మహాపురుషుల త్యాగం వృధా కాజాలదు"

— మహాత్మాగాంధీ

"హింసా పద్ధతులపై శాశ్వతనిర్మాణాన్ని దేన్నీ నిలపలేమని నా నమ్మకం. దానిసంగతి కేమి, బోల్షివిక్ ఆదర్శాలు అసంఖ్యాక స్త్రీ. పురుషుల స్వచ్ఛమైన త్యాగదీక్షపైని ఆధారపడున్నాయన్న విషయాన్ని ఎవ్వరూ కాదనలేరు. లెనిన్ వంటి మహాపురుషుల త్యాగంతో పునీతమైన ఆదర్శం వ్యర్థంకాజాలదు. వాళ్ళ త్యాగం, ఆత్మార్పణ, ఆ చంద్రార్కం వెలుగొందుతూ ఉంటుంది.

(యన్గ్ఇండియా 15–11–28)

## "మానవజాతి అభివృద్ధికి సోవియట్ ఆదర్శాలు ముఖ్యం"

వైజ్ఞానికంగాను, సామాజికంగాను మానవజాతి అభివృద్ధికి ముఖ్యమయిన కొన్ని ఆదర్శాలకోసం సోవియట్ యూనియన్ కృషి చేసింది. ఈకృషి, సోవియట్ సాధించిన విజయాలు, దురదృష్టవశాత్తు యుద్ధజ్వాలల్లో నశించిపోవడమే జరిగితే, అది చాలా విషాదకరమైన విషయం అని కాంగ్రెసు వర్కింగు కమిటీ భావిస్తుంది. సోవియట్ ప్రజలు తమ దేశాన్ని, స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవడంలో ప్రదర్శించిన అమోఘ ధైర్యసాహసాలను, ఆత్మత్యాగాన్ని వర్కింగ్‌కమిటీ కొనియాడుతూంది. ఆప్రజకు సానుభూతి నందజేస్తూంది.

(బార్డోలి 30–12–41 : వర్కింగ్‌కమిటీ తీర్మానం.)

## ఆంధ్రరాష్ట్ర రైతుసంఘం

జనరల్‌బాడీ సమావేశం

12-11-43 మధ్యాహ్నం ప్రత్యేక సమావేశం

13-11-43 ఉదయం సాధారణ సమావేశం

ప్రతి సభ్యుడున్నూ తప్పక హాజరు కాగోరుతున్నాను

నండూరి ప్రసాదరావు,
ప్రధాన కార్యదర్శి.

## న్యూజీలండు పార్టీ సందేశం

సోవియట్ యూనియన్ పొలిమేరవెలుపలికి దుష్టనాజీలను తరిమికొడుతూంది రెడార్మీ. ఈపరిస్థితుల్లో రష్యావిప్లవంయొక్క 26 వ వార్షికోత్సవం వచ్చింది.

ఇది ఫాసిజానికి ఆఖరు ఘడియలు. ఐనా తుది విజయం సాధించడానికి తీవ్ర కృషికావాలి. ఫాసిజాన్ని రూపు మాపడం ఇండియాకు ఎంతముఖ్యమో, న్యూజీలండుకూడా అంత ముఖ్యం.

ప్రపంచవ్యవహారాల్లో భారతదేశంయొక్క ముఖ్యపాత్రను క్రమ క్రమంగా అందరూ గుర్తిస్తున్నారు. భారతదేశంతో న్యూజీలండు తన సంబంధబాంధవ్యాలను బలపరచుకోవాలి.

భారతదేశంలోను, న్యూజీలండులోను, ప్రపంచంలో యితరదేశాల్లోను రేకెత్తే అభివృద్ధికర భావాలను సోవియట్ యూనియన్ యెంతో ప్రశంసిస్తుంది.

ప్రపంచ ప్రజలందరూ ఫాసిస్టు ప్రతికూల పోరాటాన్ని తీవ్రపరచాలి; అన్ని దేశాలప్రజల హక్కులపై ఆధారపడే శాంతికోసం కృషిచేయాలి. అక్టోబరు విప్లవం యొక్క 26 వ వార్షికోత్సవం యిందుకు ప్రజల నందరినీ ఉత్తేజపరుస్తుంది.

— సిడ్‌స్కాట్ (న్యూజీలండు కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శి)

## సవరణ

"సోవియట్ బాలబాలికలు" అనే పుస్తకంలో మొదటి పేజీ చివర యీవాక్యం ఉంది: "ఇలాగ రోజుకి 20 లక్షలమంది పని పిల్లలు ప్రాణాలు విడిచేవారు." "సాలుకి" అనుటకు బదులు పొరబాటున "రోజుకి" అని పడింది. పాఠకులు యీ సవరణను తెలుసుకొన గోరెదము.



శిక్షణపొందుతున్న సోవియట్ వీరవనితలు

# లూడ్ మిల్లా

## కొండేపూడి లక్ష్మీనారాయణ

ట్రెంచిమీదనేవున్న పొద కొద్దిగాకదిలింది. ట్రెంచిలోవున్న జర్మనువాడు మెల్లిగా తల పైకెత్తి అటూయిటూ చూచాడు. ఏమీ కనబడలేదు. చెవులునిక్కబొడుచుకునివిన్నాడు. ఎక్కడా చీమ చిటుక్కుమనడంలేదు. తల దించేశాడు.........

ఒకనిమిషం అయాక మళ్ళీ తలపైకి లేచింది. ఈసారి దుర్భిణీయంత్రం Field glasses) కూడా పైకి తీశాడు.....వాడింకా అద్దాలు కళ్ళదగ్గర సరిగా పట్టుకోనేలేదు..... శకీపని తుపాకిగుండువచ్చి వాడినొసటను పగిలింది.

రెండోసారి తల ఎప్పుడు పైకెత్తుతాడా అని తుపాకి గురిచేసుకుని కూర్చున్న లూడ్ మిల్లా, వాడి తలపైకి లేవగానే "నూట-ఏభై-ఎనిమి-ది" అని ట్రిగ్గర్ (మీట) లాగింది....

నాజీసైనికుడు దుర్భిణీయంత్రంతో సహా నేలకొరిగాడు. అప్పటికి లూడ్ మిల్లా చేతిలో చచ్చిన జర్మనులు నూట యాభై యేడుగురు. వీడు నూట యేభై ఎనిమిదోవాడు.

ఎనిమిదిన్నర గంటలనుంచి వాడ్ని వెంటాడుతూ లూడ్ మిల్లా పడిన శ్రమఫలించింది. అలిసిపోయిన ఆపిల్ల తన ఉన్నికోటు కప్పుకుని తుపాకి తలకింద పెట్టుకుని ఆకటికి నేలమీదనే పడుకుని నిద్రపోయింది. ఆరాత్రంతా ఫిరంగులు మోతపెడుతూనే వున్నాయి. ఆమె మాత్రం అక్కడే హాయిగా నిద్రచేసింది.

మర్నాడు వుదయమేలేచి మళ్ళా బయలుదేరింది. చెట్లు, పుట్టలు, అడవులు, లోయలు అన్నీ కలయవెదుకుతుంటూ, ఎక్కడైనా తన తుపాకిగుండుకి బలివొరుకుతుండా అని తిరగ నారంభించింది. ఇంతలో ఎక్కడినుంచో ఒక తుపాకిగుండు రివ్వుమని ఆమె తలపైనుంచి దూసుకుపోయింది.

....హుమ్మ ముండాకొడకా! ఎక్కడో వుండి నన్ను చూస్తున్నట్టున్నావే! అనుకుంది. ఇంతలో మరోగుండు....మరోగుండు ఇలా రాసాగాయి. తోకతొక్కిన తాచులాగ ఆమెకు ఒళ్ళు చరుర్రుమంది "నీపనిపడతాలే వుండు" అన్నట్లుగా తలపంకించి చటుక్కున పక్కకు తప్పుకుని చాటుగా నేలమీద కదలకుండా బోర్లపడుకుంది. కొంచెంసేపుండి, ఒక జర్మనువాడి దగ్గర సంపాదించిన దుర్భిణీ పైకితీసింది. జాగ్రత్తగా నలుదిక్కులా పరిశీలించి చూసింది..........

అమ్మయ్య! దొరికారువొంగలు! ఒకడు ఇద్దరూకాదు. ఐదుగురు! చక్కగా దాక్కొని వున్నారు పాపం! ఆమె ఐదుగురిని ఎంచి మరీ లెక్కపెట్టింది. ఇక తనపంట పండిందనుకుంది. విజయయాత్ర సాగించింది.

........నూట-యేభై తొమ్మిది....నూట-అ-ర-వై.......నూట - అరవైఒకటి........ చచ్చారు అందులో ముగ్గురు....ఎవడికి తగిలినా సరిగ్గా నొసటనేతప్ప ఇంకెక్కడా తగలదు గుండు....మిగతా యిద్దరూ కాలికి బుద్ధి చెప్పసాగారు. పారిపోయేవాళ్ళమీద గురిచూసి మళ్ళీకాల్చింది.... ఇంకోడుకూడా నేలకూలాడు. కాని అయిదోవాడు మాత్రం ప్రాణాలు దక్కించుకుని పారిపోయాడు. వాడు తప్పించుకుపోవడం ఆమెకు బాధగానే వుంది. "ఇంకా చాలామంది దొరుకుతారులే" అని సణుగుకుంది.

★

ఇది 1942 లో సెవాస్టపోల్ రంగంలో జరిగిన సంఘటనలలోఒకటి. చరిత్ర ప్రసిద్ధి గాంచిన సెవాస్టపోల్‌పోరాటంలో లూడ్ మిల్లా పేరు తెలియనివారులేరు. మరోసారి, ఒక చిన్న స్కౌట్‌సహాయంతో ఒక్కతే బయలుదేరివెళ్ళి ఒక జర్మను కమాండరు ఆఫీసులోని ఆఫీసర్లనందరిని, ఇలాగే చాటునుంచి, దెబ్బ కొకదుచొప్పున రాలగొట్టి వచ్చింది. ఆఫీసర్లు చావడంచూచి మిగతావాళ్ళంతా క్యాంపువిడిచిపారిపోయారు.

నాజీసైనికులకు ఆపిల్లపేరుచెబితే సింహస్వప్నం. 1942 జూలైనాటికి ఆమె తుపాకికి 309 మంది నాజీలు గురి—కాదు బలిఅయారు 310 పూర్తికాకముందే ఆమెను ఒకబాంబు తునకవచ్చి తగిలింది. చికిత్సకోసం ఆమె యుద్ధరంగంనుంచి వెనక్కిపంపివేయబడింది. ఆమెను కనిపెట్టలేక నాజీలు అనేక బెదిరింపులు చేసేవారు. "మాచేతికి దొరికావంటే నిన్ను తల్లకిందులుగా వేలాడగట్టి చంపుతా" మని ఇంకా ఏవేవో కూతలు కూసేవారు కోతలు కోసేవారు. కాని ఆమెను పట్టుకోగల్గిన వాడెవడు?

అయితే, ఎవరీ వీరవనిత? ఈఆడపిల్లకి ఇంతటి ధైర్యసాహసాలు, ఇంతనేర్పరితనం ఎలావచ్చాయి?

★

సోవియట్ యూనియన్‌లో బంగరుపండే యుక్రెయిన్ ఆమె జన్మభూమి. ఆమె పూర్తిపేరు లూడ్ మిల్లాపావ్లిచెంకో. వారిది ఒక నిలకడలేని కుటుంబంగానేవుండేది. తండ్రి, రీజినల్ కార్మికుడు. పనిలో ఒకచోటనుంచి ఒకచోటికి, మారుతూవుండేవాడు. తల్లి ఉపాధ్యాయిని పనిచేస్తూండేది.

లూడ్‌మిల్లా తన బాల్యంలో చాలాకాలం బెలయాసెర్కోవ్ అనే పట్టణంలో గడిపింది. బెలయాసెర్కోవ్ యుక్రేనియన్ కొసాక్ (Cossack) చరిత్రలో ప్రసిద్ధి గాంచిన పట్టణం. కొసాక్‌లు పేరెన్నికగన్న గుర్రపురౌతులు. పూర్వం కొసాక్‌ల వీరగాథలు అక్కడ కథలుగా చెప్పుకుంటూవుంటారు. కొసాక్ నాయకుడుగా చరిత్రలో వన్నెకెక్కిన బొగ్డాన్ ఖెమెల్‌నిట్‌స్కీది ఆ పట్టణమే. అగాథలన్నీ ఇప్పుడు చరిత్రలోఅడుగునపడ్డా ఆ పట్టణానికి పూర్వపుచారిత్రక లక్షణాలింకా కనపడుతూనేవుంటాయి. ఆకథలిప్పుడు మనుష్యులు మరచిపోయినా,చెట్లుమాత్రం ఇంకా స్ఫురణకు తెచ్చుకుని గుసగుసలాడుతూనే వున్నట్లుంటుంది. ఆ పచ్చని బంగరు పంటభూముల్లో, చల్లనితోటల్లోతిరగడంలోను, పిచుకల్ని వేటాడడంలోను ఆమె చిన్నతనం గడచిపోయింది. పిచుకల వేటంటే లూడ్ మిల్లాకు మంచి సరదా.

బడికివెళ్ళే వయస్సు వచ్చింది. ఆమెను బడిలోకి పంపారు. పొంగిపొరలే ఆ తెలివితేటలకి, ఆ చురుకుతనానికి, ఆమె తరగతిలో చెప్పే స్థాయి చాలలేదు. తమకు చెప్పే పాఠాలు యిట్టే గ్రహించేది. క్లాసులో అందరికంటె ముందుండేది. అంతేకాదు. పైతరగతులవాళ్ళనుకూడా ఒక్కొక్కప్పుడు మించుతూ వుండేది. కాని అల్లరి మాత్రం జాస్తి. ఉపాధ్యాయులకు ఈ అల్లరి ఎల్లా మాన్పించాలో, ఎల్లా కంట్రోలులోపెట్టాలో తోచేదికాదు. చివరకి మాస్టర్లంతాకలసి ఆలోచించి, ఆమెకు "ఈ స్కూలులోవున్న తరగతులన్నీ ప్యాసైనట్లే" అని సర్టిఫికెట్ యిచ్చి పంపివేశారు.

"నన్ను ఆ స్కూలునుంచి వదలించుకోడానికే వారా ఉపాయం ఆలోచించారు" అని ఆమె అప్పుడప్పుడు నవ్వుతూ అంటూవుంటుంది.

అంతటితో ఆమె తన స్కూలు చదువుకు స్వస్తిచెప్పింది. జీవితయాత్రకు ఏదో ఒక మార్గం అవలంబించవలసివచ్చింది. ఫ్యాక్టరీలో ప్రవేశించింది.

అక్షరాలు నేర్చినప్పటినుంచీ లూడ్ మిల్లాకు చదువంటే అసక్తి మెండు. ఎప్పుడూ ఏదో ఒకపుస్తకం చదువుతూనే వుంటుంది. ప్రయాణాలను, సాహసకృత్యాలను గూర్చిన పుస్తకాలంటే చాలా యిష్టం. అందులోనూ మంచి దృఢమనస్కులైన వీరులగాథలు చదవడమంటే కుతూహలం ఎక్కువ. చదువుతర్వాత ఆమెకు ప్రియమైనది తుపాకివేట. తుపాకి చేతబట్టితే గురితప్పడం అనేది ఎరగదు.

కొంతకాలమైన తరువాత ఫ్యాక్టరీపనికికూడా స్వస్తిచెప్పి కీవ్ యూనివర్సిటీలో చారిత్రక డిగ్రీకి చదవడానికి ప్రవేశించింది. స్కూలు చదువుకి, యూనివర్సిటీ చదువుకి చాలా వ్యత్యాసం వుందని ఆమె కప్పుడు తెలిసివచ్చింది. యూనివర్సిటీలో ఇతరులెవరూ ఎక్కువగా సహాయంచేయరు. అంతా స్వయంకృషి మీదనే ఆధారపడాలి. కానీఆమె ఆ నూతన పరిస్థితులకు అనుగుణ్యంగా తన ప్రవర్తన మార్చుకుంది. అభివృద్ధి చెందింది. ఆమెడిగ్రీ చదువు పూర్తికావచ్చింది. ఇంక డిగ్రీ పొందడానికి ఒక థీసిస్‌మాత్రమే వ్రాయాలి. చరిత్రప్రసిద్ధుడైన యుక్రేనియన్ కొసాక్ నాయకుడు బొగ్డాన్ ఖెమెల్‌నిట్‌స్కీనిగురించి వ్రాయాలని నిర్ణయించుకుంది. కాని ఆథీసిస్ పూర్తికాలేదు. ఆమెకు డిగ్రీ రాలేదు.

★

ఒకనాటిరాత్రి చదువుతో కొంచం అలసివుండడంవల్ల కిటికీవద్దకుపోయి నిలబడింది. ఆకసమంతా గప్పిన నల్లటి చీకటితెరమీద మిణుకు మిణుకుమని వెలుగుతూన్న నక్షత్రాలను చూస్తూ ఆనందిస్తోంది. తన చిన్ననాటి విహారాలు తలచుకుంటూ తన ప్రియ మాతృభూమి సౌందర్యానికి పొంగిపోతోంది. ఇంతలో ఆ ప్రశాంతవాతావరణాన్ని చీల్చుకుని నాజీ "నల్లకాకులు" (బాంబరు విమానాలు) బొంయ్ మని శబ్దం చేసుకుంటూ, కీవ్‌మీదకి వచ్చిపడ్డాయి. ఘనభోంతరాలు దద్దరిల్లేలాగ బాంబులు పడవేయసాగాయి.

లూడ్ మిల్లాకు ఒళ్ళంతా తేళ్ళు, జర్రులు ప్రాకినట్లయింది. గరుత్మంతునిలాగ భీమజవంతో ఒక్కసారి రివ్వున ఆకాశవీధిలోకి ఎగిరి ఈక్షుద్రనాజీ విమానాలను ముక్కముక్కలు చేసేటంత బలంవుంటే బాగుండుననిపించింది. కాని ఆ నిశిరాత్రివేళ, తానేమి చేయగలదు?

నాజీవిమానాలు వెళ్ళిపోయాయి. ఆమెకు మాత్రం ఆరాత్రి నిద్రపట్టలేదు. తన ప్రియ మాతృభూమి మీదకి నడిరాత్రివేళ దొంగచాటుగావచ్చి దగ్ధపటలం చేయడానికి ఫాసిస్టు శత్రువు పూనుకున్నప్పుడు ఏ స్వాతంత్ర్యప్రియులకు నిద్దరపడుతుంది? రాత్రంతా ఆలోచించింది. ఈ ఫాసిస్టులను నాశనంచేయడంలో తానెలా సహాయపడగలనా అని.

ప్రొద్దున్నేలేచింది. రెడార్మీసైనికులు టకటక వీధులలో నడుస్తున్నారు. రాత్రిజరిగిన బాంబింగు ఫలితంగా, కూలిపోయిన ఇండ్లు, రోడ్లమీద పేరుకుపోయిన రక్తం ఆమెకండ్లముందర ప్రత్యక్షం. ఆమె యిక నిలువలేకపోయింది.

తన కర్తవ్యం నిర్ణయించుకుంది స్వాతంత్ర్యప్రియులైన వారిస్థానం, యుద్ధరంగంలోనే గాని ఇంట్లోకాదు. సైనిక కార్యాలయానికి వెళ్ళింది తననుకూడా సైన్యంలో చేర్చుకోండని అడిగింది. వారు ఆమెమాటలకంత ప్రాధాన్యత ఇవ్వలేదు. యువతి, ఆవేశంలో ఏదో ఇలావచ్చి అడుగుతోందిలే అని లెక్కచేయలేదు. కాని లూడ్‌మిల్లా అంతటితో వదిలేఘటం కాదు. ఆ కమాండరుకు వూపిరి సలుపనివ్వలేదు. అదేపనిగా జుయ్యబట్టుకుంది. చివరకి సాధించింది.

ఒకవారం గడచేసరికల్లా యుద్ధరంగంలో ప్రత్యక్షం. 25 వ చపయేవ్ డివిజనులో ఒడెస్సాకు వెళ్ళింది. (మిగతా 5 పేజీలో)



# తల్లిబిడ్డల పాలిట స్వర్గసీమ సోవియట్ రష్యా

— తుమ్మల వెంకటరామయ్య

బిడ్డ పుట్టిందనగానే సంతోషిస్తారు.కాని, దరిద్రంతో మునిగిపోయే మన భారతదేశంలో అనేక కుటుంబాలకు బిడ్డ పుట్టితే ఏడవాలో, నవ్వాలో కూడ తెలియదు. బిడ్డ పుట్టినదగ్గర నుంచీ అనేక సమస్యల నెదుర్కోవాలి. తల్లి అనారోగ్యవతియై పాలు లేకపోతే డబ్బుపెట్టి పాలు కొనాలి. ఆముదం ఖర్చు, దీపం ఖర్చు చూసుకోవాలి. వీటన్నిటికీ తోడు, ఆయిల్లు ఏమురికికొంపో కావడంవల్ల జబ్బుచేస్తే వైద్య సహాయం లేక గిజగిజ తన్నుకోవాలి. ఇలా అవస్థలపడే మనవాళ్ళు సోవియట్ యూనియన్‌లో బిడ్డలకు, గర్భవతులకు, తల్లులకు కల్పించే సౌకర్యాలు చూసినప్పుడు, రష్యా 'స్వర్గసీమ'రా అంటుంటే ఆశ్చర్యమేముంది.

సోవియట్‌లో, బిడ్డ పుట్టిననాటినుండి— కాదు కాదు—స్త్రీ గర్భవతి అయిననాటినుండి కూడా సౌకర్యాలు కలిగిస్తారు. తల్లి ఆరోగ్యంగా వుంటే, చీకు చింతా లేకుండావుంటే, బిడ్డ కూడా మంచి ఆరోగ్యంతో ఉంటుందన్న విషయం అంద రంగీకరించేదే.

తల్లి సైకాలజీ (మానసికస్థితి)ని బట్టి పిల్లల మానసికస్థితికూడా వుంటుంది. అందుకని, గర్భవతులయిన స్త్రీలకు సాధ్యమైనంత చీకూ చింతలు లేకుండా చేయాలి, ఆరోగ్యవతులుగా ఉంచాలి.

## సౌకర్యాలు

సోవియట్ యూనియన్ గర్భవతులకు చేసిన సౌకర్యాలు చూద్దాం. ప్రతి గర్భవతిని ఏదో ఒక ప్రసూతి వైద్యశాలలో రిజిస్టర్ చేస్తారు. ఆమెను గురించి ఆ వైద్యశాల జాగ్రత్త తీసుకొంటుంది. గర్భవతి బలహీనంగాఉన్నా, అనారోగ్యంగాఉన్నా, ఆరోగ్యాశ్రియానికి పంపుతారు. ప్రతి పెద్దఫ్యాక్టరీలోను, పట్టణాలలోను ప్రసూతి ఆసుపత్రులుండటమేగాక, మారుమూల గ్రామాలకు కూడా ప్రసూతి సహాయపు ఏర్పాట్లున్నాయి. ప్రసూతి సమయంలో ఒక డాక్టరు, నర్సు సిద్ధంగా ఉండాలని సోవియట్ ప్రభుత్వ ఉత్తరువు. ప్రసూతి సౌకర్యాల సహాయానికి తల్లులు డబ్బేమీ ఇచ్చుకోనక్కరలేదు. పైగా ఆమెకే కొంత డబ్బు ప్రభుత్వం యిస్తుంది. గర్భవతికి ప్రసవించేముందు 35 రోజులు,తరువాత 28 రోజులు, సెలవు వుంటుంది. అదిగాక కొంత ధనసహాయం కూడా ఉంటుంది. గర్భవతులను, చంటిబిడ్డ తల్లులను, రాత్రిళ్ళు ఫ్యాక్టరీమొదలగువాటిలోనియమించకూడదు.

ఇలాంటి ఆర్థిక సహాయమేగాక, వీరికి ఆరోగ్యపద్ధతులను కూడా నేర్పుతారు. గర్భవతులు తాము ఎలా ఆరోగ్యం కాపాడుకోవాలో, బిడ్డలు పుట్టాక ఎలా పోషించాలో, పోస్టర్లు, ఫిలిములు, ఉపన్యాసాలు, పుస్తకాల ద్వారా బోధించుతారు. ఇవిగాక "తల్లీ—పిల్ల" ప్రదర్శనశాలలు ఉంటాయి. వాటిలో ఎన్నో విషయాలను వీరు నేర్చుకొంటారు. ఇవిగాక అనేక సలహా సంఘాలు, కూడ ఉంటాయి.

## భావిపౌరులు

నేటి బిడ్డలే భావిపౌరులు. వారి శారీరక మానసిక అభివృద్ధి ననుసరించే భావిసమాజం వుంటుంది. అందుకనే లెనిన్ శిశుపోషణ శాలల (క్రెచీస్)ను "కమ్యూనిస్టు సమాజాన్ని నిర్మించే కణాలు (Germ - Cells)" అని పిల్చాడు. సోవియట్ విప్లవం వచ్చిన ప్రారంభంలో మొదటినాళ్లేండ్లూ అంతర్యుద్ధాలతోను, కరువు కాటకాలతోను, నిండివున్నవి. దేశాన్ని శత్రువులనుండి, క్షామాన్నుండి కాపాడుకోవాలి. అలాంటి సమయంలో సైన్యానికి "అవసరమైనదంతా మొదట సహాయం చేయాలి," అనే నినాదం లెనిన్ ఇచ్చాడు. సైన్యం తర్వాత, బిడ్డల రక్షణ, పోషణ అతి ముఖ్యంగా ప్రభుత్వం చూచింది. ప్రసూతి అయిన తర్వాత సెలవు అయిపోగానే తల్లి పనిలో ప్రవేశించుతుంది. తల్లి పనిలోఉన్నంతసేపూఆబిడ్డనులాలించిపాలించడానికి క్రెచీస్ (శిశుపోషణ శాలలు)ఉంటాయి. ఇవి తల్లులు పనిచేసే ప్రదేశాలకు దగ్గరగా ఉంటాయి. ఫ్యాక్టరీల ప్రక్కనేగాక, చిన్న చిన్న పరిశ్రమలలో పనిచేసేవారి సౌకర్యానికిగాను పట్టణాలలో అనేకచోట్ల వుంటాయి. అంతేగాక,క్లబ్బులకు,నాటక సినిమాహాల్సుకు దగ్గరగా సాయంత్రపు క్రెచీలు వుంటాయి. రైల్వే స్టేషన్లవద్దనేగాక, దూరప్రయాణం చేసే వాళ్ళ సౌకర్యంకోసం రైళ్ళలోకొన్ని ప్రత్యేక కంపార్టమెంటులుకూడా వుంటాయి. అక్కడ తర్ఫీదు పొందిన నర్సులు (దాదులు) పిల్లల్ని కాపాడుతూ ఉంటారు. ఇవిగాక తాత్కాలికమైన క్రెచీలు గ్రామాలలో ఉంటాయి. ఊడ్పులు, కోతలు, కుప్పనూర్పిళ్ళు, మొదలైన సమయాలలోనూ,పెద్ద పెద్ద బ్రిడ్జీలు కాలువలు నిర్మించే సమయంలోను,తల్లుల సౌకర్యంకోసం ఇవి ఉంటాయి.

ఈ క్రెచీలలో ఉన్నపిల్లలను చూడటానికి, వచ్చి పాలిచ్చుకోడానికి, తల్లుల కవకాశం ఉంటుంది. ఫ్యాక్టరీలలో పనిచేసేవారు ప్రతి $3\frac{1}{2}$ గంటలకు ఇక్కడకు వచ్చి బిడ్డల్ని చూసుకోవచ్చు.

## మన దేశంలో

సోవియట్ బిడ్డలను, మన బిడ్డలనూ పోల్చిచూడండి. ఉదాహరణకు బొంబాయి కార్మిక స్త్రీలను చూడండి. వాళ్ళు ఫ్యాక్టరీలలో పనిచేయాలిసివుంటే, తమ బిడ్డలు ఏడవకండా ఏనల్లమందోవేసి పోతారు. ఏయేడెనిమి దేండ్లపిల్లలకో అప్పచెప్పిపోతారు ఏమిట్టమధ్యాహ్నమో, మిల్లు కూతకూసినప్పుడు, ఈ పెద్ద పిల్లలు ఆచంటిల్లల్ని గేట్లవద్దకి తీసుకువస్తారు. అప్పుడు గబగబా తల్లి పాలిస్తుంది. అప్పుడు నెత్తిమండే ఎండవున్నా, భోరున వర్షం కురుస్తున్నా అక్కడే మిల్లులోని మురికిగుడ్డలతోనే తల్లి, పిల్లలకు పాలీయాలి. కొంతమందికి ఆ అవకాశంకూడా సున్న.

సోవియట్‌లో క్రెచీలోకి పిల్లలు రాగానే వారి దుస్తులు మార్చి కొత్తవి ఇస్తారు. పిల్లలకు కొంత జ్ఞానం వచ్చేసరికే (2 ఏళ్ళకు), సాధ్యమయినంత వరకు ఇతరులమీద ఆధారపడకుండా, తమంతటతామే పనిచేసుకొనేటట్లు నేర్పుతారు. భోజనం అయిన తర్వాత - ముందు కూడా — వాళ్లే చేతులు, కాళ్ళు కడుక్కుంటారు. ప్రతి బిడ్డకూ ఒక మంచం, తుండుగుడ్డ, బట్టలు, పళ్లతోముకునే కుంచె వుంటుంది. ఇవన్నీ ఎవరివివారే ఉంచుకొనేటట్లు, వారికి అలవాటు చేయాలి. అందుకు వాటిమీద ఏపిట్టనో, ఏబల్లినో వేసి వేరువేరు గుర్తులు ఉంచుతారు. ఈ క్రెచీలలో కూడా పిల్లల వయస్సు బట్టి వారి సంసారం (ఆట వస్తువులు, బట్టలు, వగైరా, నివాసస్థలం) పెరుగుతూ ఉంటాయి.



క్రెచీలలో బొమ్మరిళ్ళు కట్టుకొంటున్న పిల్లలు

బిడ్డలకు మూడేండ్ల వయస్సు రాగానే నర్సరీలకు గాని, కిండర్‌గార్డెన్లకు గాని పంపవచ్చు. పిల్లల్ని ఎప్పుడూ అక్కడే ఉంచదలచుకొంటే, వారిని నర్సరీలలోకి పంపుతారు. లేక తాత్కాలికంగా మాత్రమే అయితే కిండర్‌గార్డెన్‌లలో ఉంచుతారు.

తల్లులందరూ పిల్లల్ని నర్సరీలకు, కిండర్ గార్డెన్‌లకు పంపరు. కొందరు ఇంటివద్దనే పెంచుతారు. కాని, పనికి పోయేటప్పుడు మాత్రం కిండర్‌గార్డెన్‌లో ఉంచుతారు. పిల్లలందరికీ యివి అందుబాటులో ఉంటాయి, తల్లి దండ్రులు కొద్దిగా వీటి ఖర్చు భరించినా, ప్రభుత్వమే ఎక్కువ ఖర్చును భరించుతుంది.

నేటి సోవియట్ బిడ్డలు మున్ముందు సోషలిస్టు మాతృభూమికి పేరు నిల్పే వారసులు గావాలి. అందుకనే వీరిని పెంచడంలో, పోషించడంలో ప్రభుత్వమే గాక ప్రజలందరూ సర్వతోముఖ సహాయంచేసి, ప్రపంచానికంతకూ ఆదర్శ పద్ధతులలో శిశుపోషణ సాగించుతున్నారు.

(4 వ పేజీ తరువాయి)

## లూడ్ మిల్లా

కొద్ది రోజులలోనే తన ప్రతిభను ప్రదర్శించింది. తరువాత సెవాస్టపోల్ రంగానికి పంపబడింది. స్నైపరు (Sniper)గా — స్నైపరుఅంటే, యుద్ధరంగంలో చాటుమాటుననేవుంటూ శత్రువుల జాడలను కనిపెట్టి, షికారీలాగ వారిని కాల్చి చంపేవ్యక్తి — ఆమెకు చాలినచెయ్యిలేదు. ట్రెంచిలోంచి జర్మనువాడి తల పైకిలేస్తే చాలు, లూడ్ మిల్లా పావ్లిచెంకో తుపాకి గుండుకు ఆతల పగిలిందన్నమాటే.

సెబాస్టపోల్‌రంగంలో ఆమె ప్రదర్శించిన ధైర్యసాహసాలకి, సాధించిన ఘనకార్యాలకి ఆమెకు మిలిటరీమెడల్ బహుమతి ఇచ్చింది రెడ్‌ఆర్మీ. ఆమె క్రమక్రమంగా, సార్జెంట్, సీనియర్‌సార్జెంట్,అక్కడనుంచి స్నైపర్లకు ట్రైనింగుయిచ్చే యిన్‌స్ట్రక్టరుగాను నియమింపబడింది. తరువాత ఆమెకు "ఆర్డర్ ఆఫ్ లెనిన్" కూడా యిచ్చారు.

సెవాస్టపోల్‌రంగంలో ఆమె గావించిన అద్భుతచర్యలు విన్నతరువాత లూడ్‌మిల్లా అంటే గర్వపడని రెడార్మీ సైనికుడు లేడు ఆమెసల్పిన వీరవిహారం వారిని ఉత్సాహపరుస్తుంది. ఫాసిస్టు శత్రువును దునుమాడడంలో వారి పోరాటపటిమను ద్విగుణీకృతం చేస్తుంది. ఆమెను చూడడానికికూడా చాలమంది కుతూహలపడుతూవుంటారు. ఓసారి ఒక బ్రిగేడ్ లీడరువచ్చి, "నేను లూడ్ మిల్లాను చూడాలి" అన్నాడు. లూడ్‌మిల్లా వచ్చింది. కాని ఆమెనుచూచి ఆశ్చర్యంతో అలా దూరంగానేనిలబడిపోయాడు. దగ్గరకు రావడానికే సిగ్గుపడ్డాడు. ఆమెను గూర్చి విన్నప్పుడు ఆమెఎంతో గంభీరమైన యువతి అయివుంటుందనుకునేవాడట. తీరా చూస్తే చాల నెమ్మదిగల అతిసామాన్యమైన పిల్ల. చివరకతడు సంతోషం పట్టలేక "చూడటానికి పిచ్చుకలాగేవుంది. కాని పోరాటంలోమట్టుకు పిడుగులాంటిపిల్ల" అన్నాడు.

ఆమె నిరాడంబరజీవి. గర్వమనేది ఎరుగదు. తాను ఏదో ఘనకార్యాలు చేస్తున్నాననే భావం ఆమెకెప్పుడూలేదు. ఒకసారి ఒక మీటింగులో, "నీవు ప్రపంచంలోని స్త్రీ లందరిలోను గొప్పదానవు" అని ఎవరో అంటే, ఆమె వెంటనే "ఈ చెత్తవాగుడు కట్టిపెట్టు" అని సమాధానం యిచ్చింది.

లూడ్‌మిల్లా అంతర్జాతీయ విద్యార్థి మహాసభ (వాషింగ్‌టన్)కు సోవియట్ ప్రతినిధిగా వెళ్లినప్పుడు ఆమెతో ఇంటర్వ్యూచేసిన బెట్రిస్‌కింగ్, ఆమెను ఇలా వర్ణించింది. "ఆమె సామాన్య స్త్రీ కాదు. ఒక నూతనస్త్రీ ఇలాంటివారు ఒక్క సోవియట్ యూనియన్‌లోతప్ప ఇతర దేశాలలో అరుదు."

నిజమే! ఆమె సామాన్య స్త్రీ ఎలా అవుతుంది? ఆమె సోవియట్ స్త్రీ. తన మాతృదేశ స్వాతంత్ర్యాన్ని, సంపదను అపహరింప పూనుకున్న ఫాసిస్టుల విధ్వంసంకోసం, తుపాకిబట్టి యుద్ధరంగంలో పోరాడే వీరవనిత. ఆమె మాటల్లో ఎప్పుడూ, సర్వమానవ స్వాతంత్ర్యం, సౌభ్రాతృత్వం తొలుకాడుతూ వుంటాయి. ఆమె ముఖంలో దయ, శాంతం, నిష్కాపట్యం ప్రతిబింబిస్తూవుంటాయి. కాని శత్రువును ఎదిరించి పోరాడటంలో మట్టుకు, వజ్రమంతటి కఠుకు. అక్కడ సహనమనేది ఆమెకు తెలియదు.

అందుకనే, సోవియట్ ప్రభుత్వం ఆమెకు "ఆర్డర్ ఆఫ్ ది లెనిన్" బిరుదుతోపాటు ఇచ్చిన ఆర్మీపతకంమీద ఇలా వ్రాసివుంది. "నాప్రియ మాతృదేశ స్వాతంత్ర్యాన్ని ఎవరైనా ఎదుర్కొన్నారంటే, నన్ను ఎదుర్కొన్నారన్నమాట. నన్ను ఎదుర్కోవడమంటే, నా తుపాకిగుండుకు ఆహుతికావడమేనన్నమాట"

# జాతీయ ఐక్యతకు సోవియట్ చూపుతున్న మార్గం

మద్దుకూరి చంద్రశేఖరరావు

సోవియట్ యూనియన్ ఎంతో విశాలమయినభూమి. ఉత్తరాన ధృవప్రాంతంలోని అతిశీతలమైన బురదనేల మొదలుకొని దక్షిణాన హిమాలయ పర్వతాల సమీపంవరకు వ్యాపించివుంది. తూర్పున పసిఫిక్ మహాసముద్రం మొదలుకొని పడమర బాల్టిక్ సముద్రంవరకు విస్తరించి వుంది. సోవియట్‌లో అనేకజాతుల ప్రజలు నివసించుతున్నారు. రష్యనులు, యుక్రేనియన్లు, బైలోరష్యన్లు, యుజ్‌బెక్‌లు, జార్జియన్లు, కాజక్‌లు, అజర్‌బైజాన్లు, టర్కోమన్లు, యాకూటులు, బూర్యాటులు, తజిక్‌లు, యూదులు, పోల్స్, ఫిన్నులు, మాల్డేవియన్లు, ఎస్తోనియన్లు, లిథూనియన్లు, లాట్వియన్లు వగైరా అనేకజాతులు, తెగలు వున్నాయి. ఇలా అనేకజాతుల, తెగల ప్రజలు ఉన్నప్పటికీ, వారంతా ఏకముఖంగా నిలబడి నాజీ దురంతకులతో పోరాడుతున్నారు. ప్రపంచాన్ని హిరణ్యాక్షునివలె చుట్టబెట్టి పాదాక్రాంతం చేసికోబూనిన హిట్లర్ యుద్ధతంత్రాన్ని తుత్తునియలు చేశారు.

తమ దేశస్వాతంత్ర్యాన్ని రక్షించుకోడానికి అనేకజాతులకు చెందిన సోవియట్ ప్రజలలో ప్రజ్వలితమైనయీఅకుంఠితఐకమత్యానికి కారణం ఏమిటి? మతాలు, జాతులపేరుతో ఒండొరులతో కీచులాడుకొంటూన్న మనం దేశస్వాతంత్ర్యంకొరకు, కరువుతో మాడిపోతున్న ప్రజల రక్షణకొరకు, ఐక్యమవడానికి ఉన్న అభ్యంతరమేమిటి? సోవియట్ ప్రజల అనుభవం మనకు చక్కని దోవ చూపుటలేదా? అనే ఆత్మవిమర్శన, ఆలోచన ప్రస్తుత ప్రపంచరాజకీయాలు అవలోకించుతున్న ప్రతి భారతదేశభక్తునికి కలుగుతుంది. అందుచే, సోవియట్ అనుభవాలను మనదేశానికి అన్వయించడానికిగాను అచట వివిధజాతుల మధ్య ఐకమత్యం, అన్యోన్యత యెందువలన యేర్పడిందో పరిశీలించి చూదాం!

## విప్లవానికి పూర్వం

జారు ప్రభుత్వకాలంలో రష్యా రాజ్యం కరువు, కాటకాలకు ఆలవాలంగా వుండేది. దారిద్ర్యంవల్ల వేలకొలది – ఒక్కొక్కప్పుడు లక్షలకొలది–ప్రజలు ఆహుతి అయ్యేవారు. అందువల్లనే జారుక్రింద రష్యా "వివిధజాతుల ప్రజలకు పెద్దఖయిదు"అని లెనిన్‌అన్నాడు.

విప్లవానికి పూర్వం రష్యనులు మాత్రమే జార్ సామ్రాజ్యంలో దేశీయులుగా ఎంచబడేవారు. తక్కిన జాతులన్నీ బానిస జాతులుగా పరిగణించబడేవి. రష్యన్లలోకూడ అధికసంఖ్యాకులయిన కార్మికులకు, రైతులకు యెట్టి రాజకీయ హక్కులు లేవు. ప్రజలంతా ఆర్థిక బానిసత్వంలో మునిగివుండేవారు. ఉత్తర ప్రాంతానవున్న సైబీరియన్ ప్రజలను వర్తకులు మోసపుచ్చి సూది యిచ్చి దుప్పిచర్మం కాజేసేవారు.చిన్న ఓడ్కా–సీసా(సారా)యిచ్చి ఎలుగుచర్మంపుచ్చుకునేవారు.ఊరల్ ప్రాంతాల అమాయక ప్రజలకు చిన్నగొడ్డలి యిచ్చి నక్క చర్మాలు కాజేసేవారు.

కాకసస్ ప్రాంతాల ప్రజలు తమ స్వాతంత్ర్యంకోసం తరతరాలుగా పోరాటంసల్పారు. తమ గ్రామాలను, పంటభూములను వదలి అరణ్యాలలో అర్ధాకలితోనైనా వుండేవారుగాని, వారు బానిసత్వానికి తలయొగ్గలేదు. మధ్యఆసియాపర్వతాలలో నివసించేకర్‌ఘీజ్, తాజిక్ జాతులు ఇలాంటివే ఎన్నోసార్లు వారి తిరుగుబాట్లు క్రూరంగా అణచివేయబడినా, స్వాతంత్ర్యప్రియులయిన యీ ప్రజలు మళ్ళీ తీవ్రమయిన జాతీయవిప్లవాలు లేవదీస్తుండేవారు.

జారుప్రభుత్వం తన అధికారం చెలాయించడానికి, ప్రజల నందరినీ అణచిపెట్టి వుంచడానికి, వివిధజాతులమధ్య ద్వేషాన్ని పురికొల్పేది. యూదులకు వ్యతిరేకంగా రష్యన్లను, ఆర్మీనియన్లకు ఎదురుగా అజర్‌బైజాన్లను–యీవిధంగా ఒకజాతిపై మరొకజాతిని కలహానికి రెచ్చగొట్టేది.జారుకాలంలో యూదులు అనేకసార్లు చిత్రవధ చేయబడ్డారు. ఒకసారి 'షుషా' అను 20 వేల జనాభాగల పట్టణం నేలమట్టం చేయబడింది. వివిధజాతుల మధ్య జరిగే యీఅల్లరులకు వెనకాల జారుప్రభుత్వ ప్రోత్సాహముండేది. ఇంతేగాక యూదులు, అజర్‌బైజానులు, ఉజ్‌బెక్‌లు, మరికొన్ని జాతుల ప్రజలకు ప్రభుత్వఉద్యోగాలలో ప్రవేశించే హక్కు లేదు. ఈవిధంగా జార్‌సామ్రాజ్యంలో వున్న వివిధజాతుల ప్రజలు జమీందారుల, పెట్టుబడిదారుల దోపిడితోపాటు జాతీయ బానిసత్వాన్ని కూడాఅనుభవించేవారు.

జారు ప్రభుత్వం తన సామ్రాజ్యంలోని వివిధ జాతుల ప్రజలకు వారి విజ్ఞానాన్ని, భాషను, పెంపొందించుకోడానికి ఎట్టి అవకాశం ఇచ్చేదికాదు. దీనిఫలితంగా విప్లవానికి పూర్వం కిర్‌ఘీజ్‌లో 200మంది ప్రజలలో ఒకనికి మాత్రమె చదువను, వ్రాయనూ వచ్చును. కజకస్తాన్, కిర్‌ఘీజ్, ఆర్మీనియా వగైరా జాతుల ప్రజలకు ఒక విశ్వవిద్యాలయం గాని, కనీసం ఒక్క కాలేజీ అయినా,వుండేది కాదు. స్వల్పంగా ప్రాథమిక పాఠశాలలుండేవి. ప్రజల మాతృభాషలో చదువు చెప్పడం నిషేధించబడింది. పీడిత జాతుల మాతృభాషలో సాహిత్యం ప్రకటించబడేది కాదు. ఈవిధంగా రష్యనేతర జాతుల విజ్ఞానాభివృద్ధి అరికట్టబడేది. యుక్రేనియన్ల, జార్జియన్ల, ఆర్మీనియన్ల, కిర్‌ఘీజ్ ప్రజల జానపదాలు, జాతీయకళలు అణచివేయబడ్డాయి. జార్జియన్లు జనపదాలు పాడుకొన్నందుకు అరెస్టు చేయబడేవారు. యుక్రేనియన్ల జాతీయ నాట్యరంగ నిర్మాణం నిషేధించబడింది. అనేక జాతుల ప్రజల భాషలకు లిపికూడా వుండేది కాదు.

## నవంబరు విప్లవం తరువాత!

1917 నవంబరులో జరిగిన సోషలిస్టు విప్లవం, జారు సామ్రాజ్యాన్ని విచ్ఛిన్నంచేసింది. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో కూడిన ప్రభుత్వాన్ని స్థాపించింది. కష్టజీవులైన ప్రజలందరి మాతృభూమిని నిర్మించింది. వివిధ జాతుల బానిసత్వాన్ని తుదముట్టించింది. రష్యాలోవున్న ప్రజలందరిని దోపిడినుంచి విముక్తుల్ని చేసింది. తమ భావి గతిని నిర్ణయించుకొనే హక్కును ప్రజలకు యిచ్చింది. 1917 నవంబరు 15 వ తేదీన సోవియట్ ప్రభుత్వం, లెనిన్, స్టాలిన్‌ల నాయకత్వాన, ప్రజల ప్రాథమిక హక్కులను యిలా ప్రకటించింది.

(1) సోవియట్ భూమిలో నివసించే ప్రజలందరికీ సమానత్వం, స్వాతంత్ర్య హక్కువుంటాయి.

(2) సోవియట్‌లో నివశించే అన్ని జాతుల ప్రజలకు స్వయం నిర్ణయహక్కు వుంటుంది. విడిపోయి, స్వతంత్ర రాజ్యాంగాన్ని నిర్మించుకునే హ[illegible] కూడా వుంది.

(3) కొన్ని జాతులకున్న ప్రత్యేకాధికారాలు తొలగించబడ్డాయి. కొన్ని జాతులపై వున్న నిర్బంధాలు తొలగించబడ్డాయి.

(4) రష్యాలోవున్న అల్పసంఖ్యాక జాతులఅభివృద్ధికి సంపూర్ణ అవకాశం యివ్వబడుతుంది.

ఈ ప్రకటన ప్రజలందరకు ఒకటి స్పష్టంగా తెలియజేసింది. విప్లవం కష్ట జీవులను పెట్టుబడిదారీ దోపిడీనుండి విముక్తి చేయడంతోపాటు, పీడితజాతులకుస్వాతంత్ర్యమిచ్చింది. రష్యన్ కార్మికులు, రైతులు యితర జాతుల ప్రజలతో తమ మాతృభూమి అయిన సోవియట్ రిపబ్లిక్‌ను విదేశ దండయాత్రను ది రక్షించుకొన్నారు. సోదర జాతులమధ్య సౌభ్రాతృత్వం వృద్ధిచెందింది. 1922 లో జరిగిన సోవియట్ కాంగ్రెసులో వివిధజాతీయ రిపబ్లిక్‌లను కలిపి సోవియట్ సోషలిస్టు రిపబ్లిక్ ఫెడరేషన్ నిర్మించాలని తీర్మానించబడింది.

1923 లో రష్యన్ సోషలిస్టు రిపబ్లిక్కుల ఫెడరేషన్, బైలోరష్యన్, యుక్రేనియన్ సోషలిస్టు రిపబ్లిక్‌లు, ట్రాన్స్‌కకేషియన్ రిపబ్లిక్‌ల ఫెడరేషన్ కలసి సోవియట్ యూనియన్ ఏర్పడింది. 1924 లో టర్కోమన్ సోషలిస్టు రిపబ్లిక్, ఉజ్‌బెక్ సోషలిస్టు రిపబ్లిక్ చేర్చబడ్డాయి. 1929 లో తజిక్ సోషలిస్టు రిపబ్లిక్ ఏర్పడింది. 1936 నూతన రాజ్యాంగ విధానంలో ట్రాన్స్‌కకేషియన్ రిపబ్లిక్‌ను రద్దుచేసి జార్జియన్, ఆర్మీనియన్, అజర్‌బెయిజాన్ రిపబ్లిక్‌లుగా నిర్మించబడ్డాయి. రష్యన్ రిపబ్లిక్‌లోనుంచి కిర్గిజ్, కజాక్ రిపబ్లిక్‌లు విడదీయబడ్డాయి. 1940 లో ఎస్తోనియా, లాట్వియా రిపబ్లిక్‌లు సోవియట్ యూనియన్‌లో చేరాయి. రామీనియా నుండి బెస్సరేబియాను విముక్తిచేసిన తరువాత మాల్డేవియన్ రిపబ్లిక్ స్థాపించబడింది. ఫిన్లాండునుంచి విముక్తి చేయబడిన భాగాలతో కెరేలియన్ ఫిన్నిష్ రిపబ్లిక్ స్థాపించబడింది. అన్నీ కలసి నేడు సోవియట్ యూనియన్‌లో 16 సోషలిస్టు రిపబ్లిక్‌లు చేరివున్నాయి. వీటికి విడిపోయేహక్కు సహితంవుంది.

సోవియట్ ప్రభుత్వం రాజకీయంగావున్న అసమానత్వాన్ని తొలగించింది. ఒకరినొకరు దోచుకునే విధానం రద్దుచేసింది. పాలించే జాతి, పీడితజాతి అనే విభేదాన్ని నాశనం చేసింది. అన్ని జాతుల ప్రజల అభివృద్ధికి చక్కని అవకాశాలు కలిగించింది. ఇంక జాతుల మధ్య ద్వేషానికి తావెక్కడిది? సోషలిస్టు విప్లవం సోవియట్ ప్రజల జీవిత విధానాన్నే మార్చివేసింది. విప్లవజ్యోతి దేశంలో మూలమూలలకు వ్యాపించింది. సులేమాన్ స్టాల్స్కి అను డాగెస్తాన్ కవి యిలా స్తుతించాడు. "బోల్షివిక్ విప్లవం యావత్ప్రపంచాన్ని కదల్చివేసింది. ప్రాచీన జీవితపంథాను కూడా మార్చివేసింది. మా విశాల భూములను నవంబరు విప్లవ దివ్య జ్యోతి వెలుగొందచేసింది" అన్నాడు.

## 20 ఏండ్లలో సాధించినవిజయాలు

ఇరువదియేండ్లకు పూర్వం ఎంతో వెనుకబడియున్న జాతులు నేడు ఆధునిక నాగరికతను అనుభవించుతున్నాయి. సోవియట్ ప్రభుత్వంక్రింద అన్ని జాతులు వడివడిగా అభివృద్ధి చేందుతున్నాయి. భూగర్భంలో దాగివున్న లోహసంపదను త్రవ్వి బ్రహ్మాండమైన పరిశ్రమలు నిర్మించబడుతున్నాయి. కజకస్థాన్‌లో బొగ్గు, రాగి, సీసపుగనులు–కాకేషియా ప్రాంతంలో మాంగనీస్, చమురు గనులు, ఊరల్ పర్వతాలలో ఉక్కుపరిశ్రమలు దినదినాభివృద్ధి చెందుతున్నాయి.

పూర్వం కజకస్థాన్‌లో లోహపరిశ్రమలుగాని, రైల్వేగాని లేదు. 1928-32 మధ్య మొదటి రైల్వేను నిర్మించి సైబీరియా–టర్కిస్థాన్‌లమధ్య రవాణా సౌకర్యాలు ఏర్పరచారు. అదివరకు ఎడారిగావున్న భూమి స్వరూపం మారి సస్యశ్యామలంగా చేయబడి కన్నులకుపండువుగావెలుగొందుతూంది. అదేవిధంగా ఉజ్‌బెక్‌స్థాన్‌లో దూదిపంట వృద్ధి చేయబడింది. బ్రహ్మాండమైన బట్టల యంత్రాలు నిర్మించబడి పనిచేస్తున్నాయి.

అజర్‌బైజాన్‌లో పూర్వం బాకూలో మాత్రమే నూనెగనులుండేవి. నూనెగనుల షాహుకార్లు విపరీతమైన లాభాలు గుంజుతూంటే ప్రజాసామాన్యం దరిద్రంలో మునిగివుండేవారు. నేడు చమురు ఉత్పత్తి 3 రెట్లు పెరగటమే గాకుండా, అనేకకొత్తపరిశ్రమలు వృద్ధిచెందుతున్నాయి. ఈవిధంగా సోవియట్ యూనియన్‌లోని ప్రతి రిపబ్లిక్‌లోనూసంపూర్ణమైన ఆర్థికాభివృద్ధి జరుగుతోంది. 1913 లో రష్యా అంతటిలోనూ జరుగుతున్న సరుకు రవాణా కంటే హెచ్చుగా ఒక యుక్రెయిన్ రిపబ్లిక్‌లోనే రైల్వేల ద్వారా జరుగుతోంది. అంతేగాక నదులు, కాల్వలద్వారాను, విమానాలద్వారాను రవాణా ఎంతో వృద్ధి చేయబడింది.

వివిధజాతీయ రిపబ్లిక్‌లలో పరిశ్రమలతో పాటు వ్యవసాయంకూడ త్వరితగతిని వృద్ధిఅవుతోంది. సమిష్టివ్యవసాయ కేంద్రాల ద్వారాను, ఆధునిక యంత్రాలను ఉపయోగించుట ద్వారాను వ్యవసాయ పద్ధతే మార్పుచెందింది. లక్షలకొలది మర నాగళ్లు, నూర్పే యంత్రాలు ఉపయోగించ బడుతున్నాయి. పూర్వం కొయ్య నాగలి తప్ప మరొక సాధన మెరుగని ప్రాంతాలలో నేడు ఆధునిక యంత్రాలు వినియోగించ బడుతున్నాయి. యుక్రైన్‌లో 88 వేలు దున్నే యంత్రాలు, 27 వేలు నూర్పే యంత్రాలు పనిచేస్తున్నాయి. బైలోరష్యాలో 8 వేలు దున్నే యంత్రాలు, 4 వేలు నూర్పిడి యంత్రాలు పనిచేస్తున్నాయి. (ఈ లెక్కలు 1938 నాటివి) దున్నడానికి కిర్గీజ్‌లో 4 వేలు యంత్రాలు, తాతారియాలో 3 వేల యంత్రాలు, అజర్‌బైజాన్‌లో 5500 యంత్రాలు ఉపయోగించ బడుతున్నాయి. కొత్తపంటలు ప్రవేశపెట్టబడుతున్నాయి. నవీనమైన తోటలు నాటబడుతున్నాయి, పశుసంపదను శాస్త్రీయ పద్ధతుల ననుసరించి వృద్ధిచేస్తున్నారు.

వ్యవసాయం - పరిశ్రమల వృద్ధితోపాటు అన్ని వృత్తులలోను నైపుణ్యం సంపాదించిన కార్మికులసంఖ్యకూడా పెరుగుతోంది. కమ్మరి పనివాడైనా లేని కాజక్‌లలో నేడు యింజనీర్లు, డాక్టర్లు, వ్యవసాయ శాస్త్రజ్ఞులు ఎంతోమంది తయారయ్యారు. ఇదేవిధంగా అన్ని జాతులలోనూ మేధావులసంఖ్య పెరుగుతూంది.

## పూర్వపు మూఢాచారాలు నశించాయి

వెనుకబడిన జాతులలో విప్లవానికి ముందు ఫ్యూడల్ ఆచారాలు, మూఢ నమ్మకాలు వేళ్లూని వుండేవి. ముఖ్యంగా స్త్రీల విషయం చూదాం. బాలికలను హెచ్చు శుల్కం చెల్లించిన వారికి 'పెండ్లి' అనే బజారులో అమ్మేవారు. బాలిక యిష్టాయిష్టాలతో నిమిత్తమే లేదు. హెచ్చు ఒడ్డినవాడికి ఆమె వశపరచబడేది. స్త్రీ ముఖం పరపురుషులకెవ్వరికీ కనబడరాదు. అజర్ బైజాన్, తాజిక్, ఉజ్‌బెక్‌లలో ముసుగులు ధరించేవారు. ఇండ్లుఅనే ఖైదులలో వారిని బంధించేవారు. తూర్పుదేశాల ప్రజలలో స్త్రీలకు హక్కులనేవి శూన్యం. స్త్రీ నీచంగా చూడబడేది. బాల్యంలో తండ్రికి, పడుచుదనంలో భర్తకు, ముసలితనంలో కుమారునికి స్త్రీ బానిసగా వుండేది. చేతగాని మగవాణ్ణి "నీవు ఆడదానితో సమానంరా!" అని తిట్టేవారు. దొరవగా ముందుకొచ్చే స్త్రీని "మగవాళ్ళ వ్యవహారాల్లో జోక్యం పెట్టుకోబోకు!" అని బెదిరించేవారు.

ఇట్టి స్త్రీలందరు సోవియట్ ప్రభుత్వం క్రింద సంపూర్ణ స్వాతంత్ర్యం అనుభవించుతున్నారు. పురుషులతో సమానమైన హక్కులున్నాయి. ఒకప్పుడు (మిగతా 10వ పేజీలో)



# ప్రపంచ ప్రజాక్షేమమే సోవియట్ విదేశాంగనీతిలక్ష్యము

కంభంపాటి సత్యనారాయణ (జూనియర్)

26సంవత్సరాల క్రిందట సామ్రాజ్యవాద యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ, రష్యన్ జారు సామ్రాజ్యవాదాన్ని కూలద్రోసి బయలుదేరిన సోవియట్ ప్రభుత్వం, అప్పటినుంచి ఇతర దేశాలతో ఎలాంటి సంబంధాలను పెట్టుకుంది? ఈనాడు సోవియట్ ప్రభుత్వానికి ఇతర దేశాలతో ఎలాంటి సంబంధాలు ఉన్నాయి?

సోషలిస్టు విధానాన్ని అనుసరించే సోవియట్ ప్రభుత్వం సామ్రాజ్యవాద ప్రభుత్వాలైన బ్రిటిష్, అమెరికన్ ప్రభుత్వాలతో ఒడంబడికలు చేసుకొనుట సోషలిస్టు సిద్ధాంతాలకు వ్యతిరేకంకాదా? ఇండియా స్వాతంత్ర్యానికి వర్తించదని చర్చిల్ చెబుతున్న అట్లాంటిక్ ఛార్టర్‌లోసోవియట్ ఎందుకుసంతకంచేసింది? సోవియట్ విదేశాంగ వైఖరి పరిశీలిస్తే ఈ అపోహలకు అవకాశం లేదని తెలుస్తుంది. అంతేకాదు. విప్లవం జరిగిన రోజునుంచి (1917 నవంబరు 7) ఈ నాటి వరకూ సోవియట్ ప్రభుత్వం సామ్రాజ్యవాద వ్యతిరేక దృక్పథంతో నిలబడి నిజమైన ప్రపంచ శాంతి కొరకు పోరాడుతున్నదనిగూడ సోవియట్ విదేశాంగ వైఖరివల్ల బోధపడుతోంది.

## విదేశవైఖరి : మూలసూత్రాలు

రష్యన్ కార్మిక కర్షక ప్రజా విప్లవాన్ని జయప్రదంగా నడిపిన నాయకుడే సోవియట్ విదేశ వైఖరి ఎలా ఉండాలోగూడా నిర్ణయించాడు. సోవియట్ ప్రభుత్వం చుట్టూ సోషలిజానికి శత్రువులైన సామ్రాజ్యవాద పెట్టుబడి ప్రభుత్వాలు ఉన్నంతకాలం (1) సామ్రాజ్యవాదుల మధ్యగల వైరుధ్యాలను ఉపయోగించుకుంటూ, (2) ఇతర దేశాలతో వ్యాపార, నిరాక్రమణ ఒడంబడికలు చేసుకుంటూ– సోషలిస్టు నిర్మాణాన్ని సాగించి, బలపడాలని లెనిన్ చెప్పాడు. సోవియట్ విదేశ వైఖరి యొక్క మూలసూత్రాలు ఇవే.

## బ్రెస్టు లిటోవస్క్ సంధి (1917)

తాను నిర్ణయించిన విదేశ వైఖరిని జయప్రదంగా అమలు జరిపి నిరూపించాడు లెనిన్.

1914-18 యుద్ధకాలం అది. 1917 న నవంబరులో రష్యన్ విప్లవం బయలుదేరింది. విప్లవం జరిగిన మరునాడే సోవియట్ ప్రభుత్వం యుద్ధంలో నిమగ్నులైన దేశాలన్నిటికీ, 'ఈసామ్రాజ్యవాద యుద్ధాన్ని వెంటనే ఆపి శాంతిని నెలకొల్పాలని' విన్నవించుకుంది. బ్రిటన్, ఫ్రాన్సులు వినలేదు. యుద్ధాన్ని సాగించలేనిస్థితిలో ఉన్న సోవియట్‌రష్యా, యుద్ధాన్నుండి విరమించుకొనకపోతే, ధ్వంసం ఐయిపొయ్యేది. అందుచేతనే లెనిన్ చాల కఠిన షరతులున్నప్పటికీ, సోవియటురష్యాలో చాల ప్రధాన భూభాగాలను జర్మనీకిచ్చివేయవలసి వచ్చినా, విధిలేక జర్మనీతో సంధిచేసుకోడానికి సిద్ధమయ్యాడు. జర్మనీకూడా పశ్చిమరంగంలో బ్రిటిష్ అమెరికనులతో తుది యుద్ధంకోసం రష్యారంగం నుండి తన సేనలను పశ్చిమరంగానికి పంపడానికి, సంధికి తయారయింది. అందుచే సామ్రాజ్యవాదులమధ్యగల వైరుధ్యాలను అవకాశంగా తీసుకొని, లెనిన్ బ్రెస్ట్‌లిటోవస్క్ సంధిని చేసుకున్నాడు. సోవియట్‌రష్యాను నిలబెట్టగలిగాడు.

1918 నవంబరులో జర్మనీ యుద్ధంలో ఓడిపోయినప్పుడు, యుద్ధకాలంలో జరిగిన ఒడంబడికలతోపాటు బ్రెస్ట్‌లిటోవస్క్ సంధిని గూడా సోవియటురష్యా రద్దుచేసింది. కాని, సోవియట్ విదేశాంగ వైఖరికి చక్కని ఉదాహరణగా చరిత్రలో ప్రసిద్ధి కెక్కింది.

## 1918—21

సోవియట్ విప్లవంతో సామ్రాజ్యవాదుల ప్రపంచపెత్తనానికి దెబ్బతగిలింది. సామ్రాజ్యవాదుల కోటను ఎదిరించే ప్రజా ప్రభుత్వ కోట ఒకటి బయలుదేరింది. అంతపెద్దవిశాల భూభాగంలో బయలుదేరిన సోషలిజాన్ని తమ సామ్రాజ్యాలలోని ప్రజలు గూడా అనుకరిస్తారనే భయం సామ్రాజ్యవాదులకు కలిగింది. సోవియట్ యూనియన్ మీద 1918 లో 14 రాజ్యాలు, అన్నిదిక్కులనుంచి దాడి ప్రారంభించాయి. 1920 వరకూ యిది సాగింది.

ఈదశలో సోవియట్‌ప్రభుత్వం సోవియట్ ప్రజలందరిని సమీకరించి, సామ్రాజ్యవాదుల దాడిని జయప్రదంగా ఎదుర్కొంది. ఇతర దేశ కార్మికప్రజలు (బ్రిటన్, ఫ్రాన్సు)గూడా అప్పుడే సోవియట్ ప్రభుత్వానికి సానుభూతితో సహాయంచేశారు. సోవియట్‌ప్రభుత్వం స్థిరపడుటకు ప్రారంభించింది.

పూర్వం జార్ సామ్రాజ్యంక్రింద వున్న పోలెండు, లాట్వియా, లిథూనియా, ఇస్తోనియా, ఫిన్లండు దేశాల స్వాతంత్ర్యాన్ని గుర్తించి, యీదశలోనే సోవియట్ ప్రభుత్వం తన సామ్రాజ్య వ్యతిరేక వైఖరిని ప్రపంచానికి చాటింది. చైనా, ఇరాన్‌లలో జారు చక్రవర్తికి వున్న ప్రత్యేక అధికారాలన్నిటిని సోవియట్ వదులుకుంది. టర్కీ స్వాతంత్ర్య యుద్ధానికి తోడ్పడింది.

సోవియట్ ప్రభుత్వాన్ని బహిష్కరించి బ్లాకేడ్ చేయాలని సామ్రాజ్యవాదులు ప్రయత్నించిన రోజులు అవి. వారి ప్లానులను భగ్నం చేస్తూ, సరిహద్దు దేశాలన్నిటితో స్నేహ, వ్యాపార ఒడంబడికలను చేసుకుంది.

ఈదశలోనే 1920 లో 'జాతిసమితి'తీర్పరిచేసమహాంలో, తన్ను ఆహ్వానించకపోయినా సోవియట్ ప్రభుత్వం తన సూచనలను పంపింది. అన్ని దేశాల స్వాతంత్ర్యాన్ని గుర్తించి, కాలనీల పద్ధతిని రద్దుచేసి, యుద్ధ అప్పులను కొట్టివేసి, సంపూర్ణఆయుధవిసర్జన చేయుట ద్వారానే నిజమైన ప్రపంచ శాంతిని యిచ్చే జాతిసమితి ఏర్పడగలదని సోవియట్ ప్రభుత్వం ప్రకటించింది.

## 1921—25

సోవియట్‌మీద దాడి విఫలమైనతరువాత, సోవియట్‌భూమిలోని సహజ సంపద నంతా దోపిడిచెయ్యాలని సామ్రాజ్యవాదులు కుట్రలు చేశారు. సోవియట్ యూనియన్‌లోని ఫ్యాక్టరీలను విదేశపెట్టుబడిదారుల స్వాధీనంచెయ్యాలని, జారు ప్రభుత్వం యివ్వవలసిన పాత బాకీలు చెల్లించాలని, లేనియెడల మరల సోవియట్‌మీద దాడి సాగించెదమని 1922 లో జీకోపట్టణంలో జరిగిన ఆర్థిక సమావేశంలో సోవియట్ ప్రభుత్వాన్ని బెదిరించారు. సోవియట్ ప్రభుత్వం యీ సూచనలను త్రోసివేసింది. తిరిగి సామ్రాజ్యవాదులలోని చీలిక ఆధారంగా చేసుకుని ఆసమయంలోనే అప్పటనే జర్మనీతో స్నేహ, వర్తక ఒడంబడికలు చేసుకుంది.

ఇక లాభంలేదనుకొని 1924 లో బ్రిటన్, ఫ్రాన్సు, ఇటలీ, జపాను ప్రభుత్వాలు సోవియట్‌తో వ్యాపార ఒడంబడికలు, మామూలు సంబంధాలు యేర్పాటు చేసుకున్నాయి. 1922 లోనే జర్మనీతో ఒడంబడిక జరిగింది. 1924 లోనే చైనాతోగూడా ఒడంబడిక ఏర్పడింది. అమెరికా మాత్రం 1933 వరకూ సోవియట్ ప్రభుత్వాన్ని గుర్తించలేదు.

ఈఒడంబడికలద్వారా సోవియట్ యూనియన్ క్రమేణా స్థిరపడి, పరిశ్రమలను అభివృద్ధి చేసుకుంటూ త్వరలోనే బ్రిటన్, ఫ్రాన్సు, అమెరికాలతో సమాన పారిశ్రామిక అభివృద్ధిని సంపాదించింది.

## 1926 – 1929

సోవియట్ యూనియన్ పారిశ్రామిక అభివృద్ధికి ఎన్నిఅడ్డంకులు కల్పించాలో అన్నీ కల్గించాయి సామ్రాజ్యవాద ప్రభుత్వాలు. చివరికిసోవియట్‌తో సంబంధాలుతెంచుకొన్నాయి గూడా. అంతర్జాతీయ సాంప్రదాయాలకు వ్యతిరేకంగా 1927 మే లో లండన్‌లోని సోవియట్ వ్యాపార, రాయబార భవనాల మీద పోలీసుదాడి జరిపి, బ్రిటిష్ ప్రభుత్వం సోవియట్‌తో సంబంధాన్ని తెంచుకుంది. 1927 జూన్ నెలలో పోలెండులోని రష్యన్ రాయబారి కామ్రేడ్ వాయకోవ్ ఖూనీ చేయబడ్డాడు. అదేసమయంలో లెనిన్‌గ్రాడ్‌లోని ఒక కమ్యూనిస్టుపార్టీ క్లబ్‌మీద బ్రిటిష్ ఏజంట్లు బాంబులువేసి 30 మందిని గాయపరిచారు. ఆసంవత్సరంలోనే బెర్లిన్‌లోను, చైనాలో పెకింగ్, షాంగ్‌హై, టీన్స్‌టిన్ నగరాలలోను రష్యన్ రాయబారుల భవనాలమీద దాడులు జరిగాయి. ఈ విధంగా సోవియట్ వ్యతిరేకదాడి కొత్తరూపంలో జరిపారు సామ్రాజ్య వాదులు. సోవియట్ ప్రజలు సామ్రాజ్యవాదుల ప్రయత్నాలకు లొంగలేదు. చివరికి 1929 లో చైనాకు సోవియట్‌కు మధ్య తగాదాపెట్టి, సోవియట్‌ను యుద్ధంలోకి లాగాలని చూచారు. సోవియట్‌కు చెందిన తూర్పు చైనారైల్వేను చైనా మిలటరీ అధికారులు స్వాధీనం చేసుకొనుటకు ఉసిగొల్పారు. కాని, ఈప్రయత్నాలను ధ్వంసం గావించి సోవియట్ శాంతిని కాపాడింది.

## 1929 – 1933

ఇది ప్రపంచ ఆర్థిక సంక్షోభకాలం. ఒక్క సోవియట్ యూనియన్‌లో తప్ప, మిగిలిన పెట్టుబడి ప్రపంచమంతటా పెద్ద ఆర్థిక సంక్షోభం బయలుదేరింది. అమెరికాలో నూటికి 35 వంతులు, బ్రిటన్‌లో 14, జర్మనీలో 34, ఫ్రాన్సులో 23 వంతులు పారిశ్రామిక ఉత్పత్తి 1929 లో కంటె 1933 లో తగ్గిపోతే, సోవియట్ యూనియన్‌లో అదే కాలంలో, నూటికి 20 వంతులు ఎక్కువయింది. పెట్టుబడి దేశాల్లో అమెరికా, ఇంగ్లండు, జర్మనీ, పశ్చిమయూరప్ దేశాలలో 2 కోట్ల నిరుద్యోగులు బయలుదేరితే, సోవియట్‌లో ఆసమస్యేలేదు.

ఈ విధంగా సోవియట్ యూనియన్ బలపడుతున్నప్పుడు తమ సామ్రాజ్యాలలో రోజురోజుకు వృద్ధి అవుతున్న జాతీయోద్యమాలవల్ల, కార్మికఉద్యమాలవల్ల సామ్రాజ్యవాదులు బలహీనపడసాగారు.

ఈసమయంలోనే బ్రిటన్, ఫ్రాన్సు, అమెరికాల సామ్రాజ్యవాదులకు పోటీగా జర్మనీ, జపాన్, ఇటలీ ఫాసిస్టు సామ్రాజ్యవాదుల కూటమి బయలుదేరింది. తమకుగూడా సామ్రాజ్యాలు కావాలని యుద్ధాలకు దిగారు. వెనుకనుంచి బ్రిటన్, ఫ్రాన్సులు ఫాసిస్టులను బలపరచడం ప్రారంభించారు. చిన్నచిన్న దేశాలను ఫాసిస్టులకు ఆహుతి చేసి, సోవియట్ యూనియన్ మీదికి ఫాసిస్టులను పురిగొల్పుటద్వారా తమ ప్రపంచ పెత్తనాన్ని కాపాడుకోవచ్చుననే కుట్రలు ప్రారంభించారు. పశ్చిమాన, తూర్పున బయలుదేరిన ప్రమాదాన్ని ఎదుర్కొనుటకు సోవియట్ ప్రభుత్వం సన్నాహమయింది.

## 1934 – 1939

సామ్రాజ్యవాదులు, ఫాసిస్టులు తిరిగి ప్రపంచాన్ని యుద్ధంలో ముంచుటకు ప్రారంభించారు. ఈ నూతన దాడిని ఎదుర్కొని ప్రపంచ శాంతిని కాపాడుటకు నడుము కట్టింది సోవియట్ ప్రభుత్వం.

ఫాసిస్టు సామ్రాజ్యవాదుల దాడిని ప్రతిఘటించుటకై 1934 లో సోవియట్ యూనియన్ జాతి సమితిలో చేరింది. జాతి సమితి లోపలి నుంచి, బయటినుంచి, కూడా ఫాసిస్టు సామ్రాజ్యవాదుల కుట్రను బట్టబయలుచేసి, ప్రపంచ ఫాసిస్టు వ్యతిరేక సంఘటనకు పూనుకుంది. యుద్ధవ్యతిరేక ప్రచారం సాగించింది. ఫాసిస్టు దురాక్రమణను ఖండిస్తూ ఫాసిస్టు దాడిని ఎదుర్కొనుటకు 1935 లో ఫ్రాన్సు, చెకోస్లోవేకియాలతో పరస్పర సహాయ ఒడంబడికలను చేసుకుంది. తన చుట్టూవున్న అన్ని దేశాలతోను, 1937 లో చైనాతోనూ,నిరాక్రమణ సంధులు చేసుకుంది. ఈ రోజులలోనే ప్రజల కృషివల్ల ఫ్రాన్సు, స్పెయిన్, చైనాదేశాలలో ఫాసిస్టు వ్యతిరేక సంయుక్త ప్రభుత్వాలు ఏర్పడినాయి.

చివరికి 1936 లో స్పెయిన్‌మీద జర్మనీ ఇటలీలు, 37 లో చైనామీద జపాను, గావించిన దురాక్రమణ విషయంలో బ్రిటన్, ఫ్రాన్సులు తటస్థంగా ఉండి ప్రజా పోరాటాలకు ద్రోహం చేశాయి. సోవియట్ యూనియన్ స్పెయిన్,చైనాలకు సాధ్యమైనంత సహాయం చేసింది.

తిరిగి సామ్రాజ్యవాద యుద్ధం బయలుదేరకుండా, ఫాసిస్టులను అరికట్టి శాంతిని కాపాడుటకు సోవియట్ చివరి నిమిషం వరకూ, సర్వశక్తులూ వినియోగించి కృషిచేసింది. బ్రిటన్, ఫ్రాన్సులతో ఒడంబడికలు చేసుకొనుటకై సోవియట్ ప్రభుత్వం 1939 లో యుద్ధం ప్రారంభమయే వరకూ సంప్రదింపులు సాగించింది. కాని యుద్ధాన్ని ప్రేరేపించి, సోవియట్‌మీదికి మరల్చుటకు ప్రయత్నిస్తున్నబ్రిటన్,ఫ్రాన్సులు,ఫాసిస్టులకు వ్యతిరేకంగా సోవియట్‌తో ఒడంబడికకు తయారుకాలేదు. ఇక లాభంలేదని నిరూపించబడిన తరువాత, స్వరక్షణకై జర్మనీతో నిరాక్రమణ ఒడంబడికను సోవియట్ (1939 ఆగస్టు 28) చేసుకుంది. జర్మనీ సోవియట్ రష్యాపై యుద్ధంచేయనని ఒడంబడిక చేసుకోవడం బ్రిటిష్, ఫ్రెంచి సామ్రాజ్య వాదులకు మరింత ద్వేషం కలిగించింది. 1939 లో బ్రిటన్ ఫ్రాన్సులు, జర్మనీ మధ్య రెండవ సామ్రాజ్య యుద్ధం ప్రారంభమయింది.

## 1939 – 41 జూన్ 22

ఈ దశలో సోవియట్ ప్రభుత్వం సామ్రాజ్యవాద యుద్ధం ఆపాలని నినాదం యిచ్చింది. యుద్ధంవల్ల ప్రజలు మారణహోమంలో చచ్చిపోవుట తప్ప మరొక ప్రయోజనం లేదని చాటింది. నిజమైన శాంతి కావాలని, శాంతిని ఏర్పరచగల ప్రభుత్వాల కోసం అన్నిదేశాల్లో ప్రజలు ఉద్యమాలను సాగించారు. పోలెండు ఆక్రమణ తరువాతనైనా యుద్ధాన్ని ఆపమని బ్రిటన్ ఫ్రాన్సులకు సోవియట్ చేసిన విన్నపం నిరుపయోగమైంది. యుద్ధాన్ని వ్యాపింపజేస్తూ, సోవియట్ వ్యతిరేక యుద్ధంగా మార్చాలని బ్రిటిష్, ఫ్రెంచి,అమెరికన్ ప్రభుత్వాలు తెగ ప్రయత్నించినాయి. ఉదాహరణ ఫిన్లండు యుద్ధం. ఫిన్లండుకు సోవియట్‌కు–ఇద్దరికీ లాభకరమైన సంప్రదింపులకు వ్యతిరేకంగా ఈసామ్రాజ్యవాదులు ఫిన్లండు ప్రభుత్వాన్ని సోవియట్‌కు వ్యతిరేకంగా ఉసిగొల్పి, దాన్ని ముఖ్య యుద్ధంగా మార్చాలని 1940 మేలో చర్చిల్ అధికారంలోకి వచ్చేవరకూ కుట్రలు జరిగినాయి. ఈ కుట్రలన్నీ విఫలమయాయి.

1940 జూన్‌లో ఫ్రాన్సును ఆక్రమించారు హిట్లర్. ప్రమాదం బ్రిటిష్ ప్రజల నెత్తిమీదికి వచ్చింది. హిట్లరు బలం ఎక్కువయింది. 1940 ఆగస్టు నుంచి బ్రిటిష్ ప్రజలమీద ఘోరమైన విమానదాడులు ప్రారంభమయినాయి. 1941 మే తో యూరప్ అంతా హిట్లర్ వశమయింది. దీనితో ఫాసిస్టులకు పైచెయ్యివచ్చింది.

ఫాసిస్టు ప్రమాదం ఎక్కువగుతున్నకొలదీ, బ్రిటన్, సోవియట్‌తో ఒడంబడిక చేసుకొని హిట్లరును ఎదుర్కొని యుద్ధాన్ని త్వరలో అంతం చేయాలనే (మిగతా 10 వ పేజీలో)

# ప్రపంచ శాంతి భద్రతలకు ప్రాతిపదిక

మాస్కోలో త్రైరాజ్య విదేశాంగ మంత్రుల సమావేశం పూర్తి అయింది. ఈ సమావేశాన్ని గురించి లండన్‌నుండి వెలువడిన పూర్తిపాఠం యీ క్రింద ఇస్తున్నాం.

★

ఈ మూడుప్రభుత్వాలు చర్చకుగాను నివేదించిన అంశాలన్నీ యెజండాలో వున్నాయి. ఇందు కొన్నివిషయాలమీద తుదినిర్ణయాలను వెంటనే చేయవలసివచ్చింది. అలా తుదినిర్ణయాలు తీసికోడంకూడా జరిగింది. ఇక మిగిలిన విషయాలపై చర్చ జరిగినతర్వాత, అవి సిద్ధాంతరీత్యా ఫలానివిధంగా ఉండాలనే నిర్ణయాలకు వచ్చాయి. ఈవిషయాలను సాకల్యంగా ప్రత్యేక కమిషన్లు (యిందుకొరకు నియమించబడినాయి) చర్చిస్తాయి. లేదా విదేశ కార్యాలయ రాయబారులద్వారా వీటిని గురించి చర్చించడానికి వదలివేయబడినాయి. ఇక మరికొన్ని సమస్యలవిషయమై పరస్పర అభిప్రాయాలను తెలిసికోవడం జరిగింది.

అందరికీ సంబంధించిన యుద్ధకృషికి చెందిన అంశాలన్నిటిలోను అమెరికా, బ్రిటను, సోవియటుయూనియను ప్రభుత్వాలు సన్నిహిత సహకారంతో ప్రవర్తించుతున్నాయి. కాని, మూడురాజ్యాల విదేశాంగ మంత్రులు సమావేశమై ముఖాముఖి చర్చించడము ఇదే మొదటి పర్యాయం.

యూరప్‌లో జర్మనీకి, దాని ఉపగ్రహాలకు వ్యతిరేకంగా జరుగుతున్న యుద్ధాన్ని త్వరగా ముగించడానికి అవసరమైన చర్యలను గురించి స్పష్టంగాను,వివరంగాను చర్చించాం. కొన్ని నిర్ణయాలుకూడ తీసుకొన్నాం. ఆ నిర్ణయాలను ఆచరణలో పెట్టడానికి కావలసిన ప్రత్యక్ష యుద్ధ చర్యలను గురించి, తమతమ దేశాల తరఫున హాజరైన మిలటరీ నిపుణులతో చర్చించాం. ఆ చర్చల ఫలితంగా మూడు దేశాలు కలసి, భవిష్యత్తులో యుద్ధం సాగించడానికి కావలసిన ఏర్పాటులను కూడ ఆరంభించాం.

## యుద్ధానంతర సహకారం

"యుద్ధాన్ని త్వరగా ముగించాలని వారు గుర్తించారన్నది అతి ప్రాముఖ్యమైన విషయమే. కాని దాని తర్వాత ముఖ్యమైన రెండవ విషయం ఇంకొకటి ఉంది. అది: తమ స్వజాతీయ క్షేమాల్ని అనుసరించి శాంతినికోరే సమస్త దేశాల క్షేమాల్ని అనుసరించి, ఈమూడు దేశాలు ప్రస్తుత యుద్ధ నిర్వహణంలో చూపించుతున్న సన్నిహిత సహకారాన్ని కలయికను యుద్ధానంతర కాలంలో కూడ కొనసాగించాలి. ఈవకంగా సన్నిహిత సహకారమూ, కలయికా చూపుట ద్వారానే శాంతిని కాపాడగలం. ఆయా దేశాల ప్రజల రాజకీయ, ఆర్థిక, సామాజిక శ్రేయస్సును పెంపొందించగలం.

1942 జనవరి 1 వ తేదీన - అతర్వాతను - గావించిన ప్రకటనల ననుసరించి అక్షరాజ్యాలు బేషరతుగా లొంగిపోయి ఆయుధాలు క్రిందపెట్టేవరకు, తమతమ శత్రువులతో పోరు కొనసాగించడానికి అమెరికా, బ్రిటేన్, రష్యా, చైనాలు కృతనిశ్చయంతో ఉన్నాయి. దురాక్రమణ ప్రమాదంనుండి తామూ, తమ మిత్ర ప్రజలూ రక్షింపబడవలసినబాధ్యతను ఈదేశాలు గుర్తిస్తున్నాయి. యుద్ధ సమయంనుండి శాంతి సమయానికి త్వరత్వరగాక్రమపద్ధతిని పరివర్తనంచేయుట. అంతర్జాతీయ శాంతి భద్రతలను నెలకొల్పి కాపాడుట.తమ అంగబలాన్ని, అర్థబలాన్ని ఉపయోగించి తద్వారా ఆయుధాలకోసం వీలైనంత తక్కువ ఖర్చుపెట్టుట - అవసరమని గుర్తించుతూ ఈనాల్గు దేశాలు కలిసి క్రింది విధంగా ప్రకటించుతున్నాయి:

1. తమ తమ శత్రువులకు వ్యతిరేకంగా యుద్ధాన్ని నిర్వర్తించటానికి ఈ దేశాలు గావించే సంయుక్త కార్యాచరణ, ఇకముందు కూడా శాంతిభద్రతల నిర్మించి కాపాడటానికి కొనసాగించబడుతుంది.

2. ఒకే శత్రువుతో ఉమ్మడిగా కత్తికట్టిన దేశాలు, ఆ శత్రువు లొంగుబాటు - ఆ శత్రువును నిరాయుధునిచేయుట - మొదలగు విషయాలను గురించి ఐక్యంగా అవసరమైన చర్య తీసుకొంటాయి.

3. శత్రువుపై విధించిన నిబంధనలను ఉల్లంఘించిన పక్షంలో అవసరమయే చర్యలన్నిటినీ ఇవి తీసుకొంటాయి.

4. అంతర్జాతీయ శాంతినీ భద్రతనూ కాపాడటానికిగాను, సాధ్యమైనంత త్వరలో ఒక అంతర్జాతీయ సంఘాన్ని నెలకొల్పవలసిన అవశ్యకతను గుర్తిస్తున్నాయి. శాంతిని కోరే ప్రతిదేశమూ సంపూర్ణమైన స్వేచ్ఛా ప్రతిపత్తితో ఈ అంతర్జాతీయ సంఘంలో పాల్గొంటుంది. చిన్న పెద్ద అనే విభేదం లేకుండా అలాంటి దేశాలన్నీ ఈ అంతర్జాతీయ సంఘంలో సభ్యత్వం పొందడానికి హక్కువుంది.

5. లా అండ్ ఆర్డర్‌ను తిరిగి నెలకొల్పేలోగా, శాంతిభద్రతలకాపాడే విధానం ప్రారంభించేలోగా, అంతర్జాతీయ శాంతిభద్రతలను కాపాడటానికిగాను ఈ నాల్గుదేశాలు తమలో

# మాస్కో సమావేశ నిర్ణయాలు

తామూ,ఇతరమిత్రరాజ్యాలతోను సంప్రదించుకొంటాయి. వివిధదేశాల కూటమి తరఫున సంయుక్త కార్యాచరణకుగాను ఇలా సంప్రదించుతాయి.

6. యుద్ధం ముగిసిపోయినతరువాత, పరస్పరం సంప్రదించుకొని చేసిన ఈప్రకటనలో ఉద్దేశింపబడిన కార్యాలకుతప్ప, ఇతర దేశాలలో తమ మిలటరీబలాలను నియమించవు.

7. యుద్ధానంతరకాలంలో, ఆయుధ పరిమితిని గురించి ఆచరణయోగ్యమైన ఒడంబడిక తీసుకురావడానికిగాను, యీ దేశాలు పరస్పరంగాను, యితర మిత్రరాజ్యాలతోను, సంప్రదించుకొనుటేగాక, సహకారం చేసికొంటాయి.

## ఇటలీయెడ వైఖరి

ఇటలీలో ఫాసిజాన్ని, దానివల్ల ఏర్పడిన చెడు ప్రభావాన్నీ, ఫలితాలనూ పూర్తిగా నాశనం చేయాలి. ప్రజాస్వామ్య సూత్రాలపై ప్రభుత్వసంస్థలను, యితరసంస్థలను నెలకొల్పుకొనడానికి ఇటలీ ప్రజలకు పూర్తిఅవకాశాన్ని ఈయాలి. ఇటలీయెడల మిత్రరాజ్యాలు అవలంబించిన వైఖరికి ప్రధానసూత్రం పైన చెప్పబడిందేనని బ్రిటన్, అమెరికా, సోవియటు యూనియన్ ప్రభుత్వాలు అంగీకరించుతున్నాయి. బ్రిటిష్, అమెరికన్ విదేశాంగ మంత్రులు యీవిధంగా ప్రకటించారు: "ఇటలీపై దండయాత్ర ప్రారంభించిననాటనుండీ మా ప్రభుత్వాల చర్యలు అతి ముఖ్య మిలిటరీ అవసరాలు వీలుకల్గించినంతవరకు ఈపాలసీపైననే ఆధారపడివున్నాయి."

మూడు దేశాల విదేశాంగ మంత్రులు ఈ క్రింది చర్యలు అతి ప్రాముఖ్యమని భావించి ఆచరణలోపెట్ట నిశ్చయించారు:

ఫాసిజాన్ని ఎల్లప్పుడూ ఎదిరించుతూ వచ్చిన ఇటలీ ప్రజల ప్రతినిధులను ఇటలీ ప్రభుత్వంలో చేర్చుకొనుటద్వారా ఇటలీ ప్రభుత్వాన్ని ప్రజాస్వామ్య ప్రభుత్వంగా మార్చాలి.

వాక్, సభా, పత్రికా, మత, స్వాతంత్ర్యమూ, తాను నమ్మిన రాజకీయాలను ప్రచారం చేసికొనే హక్కునూ, ఇటలీ ప్రజలకీయాలి. ఫాసిస్టు ప్రతికూల పక్షాలను ఏర్పరచుకోడానికి కూడా వారికి హక్కుండాలి.

ఫాసిస్టు పరిపాలనలో నెలకొల్ప బడిన సంస్థలూ - సంఘాలు అన్నీ అణచివేయబడాలి.

ఫాసిస్టులనూ, ఫాసిస్టు అనుకూలురనూ అందరినీ, పరిపాలననుంచి, ప్రజాసంస్థలనుంచి, ప్రజా సంఘాలనుంచి తొలగించివేయాలి.

ఫాసిస్టు పరిపాలనలో నిర్బంధింప బడిన రాజకీయ ఖైదీల నందరినీ విడిచిపెట్టాలి.

స్థానిక ప్రభుత్వంలో ప్రజాస్వామ్య సంస్థలను నెలకొల్పాలి.

యుద్ధ నేరాలకు కారకులుగా అనుమానింపబడిన, లేక కారకులని తెలిసిన ఫాసిస్టు పార్టీ ముఖ్యులను, ఇతర సైనిక నాయకులను అరెస్టుచేసి విచారణకు అప్పగించాలి.

ఈ పై ప్రకటన గావించుతూ మూడు దేశాల విదేశాంగమంత్రులు ఒక విషయాన్ని గుర్తించుతున్నారు. అది: ఇటలీలో యుద్ధం కొనసాగుతున్నంతకాలం, పైన వివరించిన సూత్రాలను ఆచరణలో పెట్టడానికి సాధ్యమైన సమయమేదో వివిధ సైనిక ప్రధానోద్యోగుల సూచనల ననుసరించి సర్వసేనాధిపతి (కమాండర్ ఇన్ ఛీఫ్)యే నిశ్చయించుతాడు. ఈ మూడింటిలో ఏ ఒక్క దేశంగాని ఈవిషయమై సంప్రదించాలనికోరితే, మూడు దేశాలు కలిసి సంప్రదించుతాయి. ఇటలీ ప్రజలు తుట్టతుదకు తమ ఇష్టంవచ్చిన ప్రభుత్వాన్ని ఎన్నుకొనేహక్కుకు ప్రతిబంధకంగా ఈ తీర్మానంలో ఏ అంశాన్ని ఉపయోగించకూడదని మూడుప్రభుత్వాలు గుర్తించుతున్నాయి.

## స్వతంత్ర ఆస్ట్రియా

నాజీ దురాక్రమణకు మొట్టమొదటిగా గురియైన ఆస్ట్రియాను జర్మనీ ఆధిపత్యంనుండి విముక్తిచేయాలని, ఈ మూడు ప్రభుత్వాలు అంగీకరించుతున్నాయి. 1938 మార్చి 15 వ తేదీన ఆస్ట్రియాలో జొరబడి దురాక్రమణ గావించిన జర్మను అధికారం చెల్లుబడికాదు. ఆ తేదీనుండి ఆస్ట్రియాలో కల్గిన మార్పులను ఈ మూడుదేశాలు గుర్తించవు.

ఆస్ట్రియాలో స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను నెలకొల్పడానికి ఈ మూడు రాజ్యాలు కోరుతున్నాయి. తద్వారా ఆస్ట్రియన్ ప్రజలకు, ఇలాంటి సమస్యలనే ఎదుర్కొనే దాని పొరుగు దేశాల ప్రజలకు రాజకీయ ఆర్థిక భద్రతలను స్థిరపరచుకొనే అవకాశంఇస్తుంది. అట్టి రాజకీయ ఆర్థిక భద్రత లొక్కటే శాశ్వత శాంతికి పునాది. అయినప్పటికీ ఆస్ట్రియాపై ఒక బాధ్యత ఉన్నదనే సంగతి జ్ఞాపకం చేయాలి. ఆస్ట్రియా అబాధ్యతను తప్పించుకోలేదు. అది హిట్లరు జర్మనీ తరఫున యుద్ధంలో పాల్గొన్నదన్న విషయాన్ని తప్పించుకోలేదు. ఇపుడు తన విముక్తికోసం అదిఎంత కృషిచేస్తుందో ఆవిషయాన్ని కూడ ఆఖరి పరిష్కార సమయంలో తప్పకుండా చూడవలసివుంది. హిట్లరు ఆధిపత్యం క్రింద జరిగిన ఘోర దురంతాలు అందరికీతెలిసినవే. నాజీ ఆక్రమిత దేశ ప్రజలు జర్మనీ నియమించిన హింసాయుత ప్రభుత్వాలవల్ల అతి క్రూరమైన బాధలకు గురిఅయ్యారు. ఇప్పుడు కొత్తవిషయ మేమిటంటే, ఈ నాజీ ఆక్రమిత దేశాలకు, పురోగమించుతున్న మిత్రదేశాల స్వాతంత్ర్య ప్రదాయక సైన్యాలు చెర తప్పించుతున్నాయి. అందుచేతోక ముడుచుతున్న నాజీ ముఠా జర్మన్లు నిస్పృహతో తిరిగి నిర్దాక్షిణ్యమైన క్రూర కృత్యాలను రెట్టింపుచేస్తున్నారు. హిట్లరు చెరనుండి తప్పించబడే సోవియట్ భూభాగంలో వీరు గావించే రాక్షస కృత్యాలవల్ల ఈ విషయం మరింత స్పష్టంగా సోవియటుయూనియన్‌లో కన్పడుతోంది. ఫ్రెంచి, ఇటలీ, ప్రదేశాలలో కూడ వారిట్టి క్రూరకృత్యాలనే చేస్తున్నారు.

అందుచే, 32 మిత్రరాజ్య క్షేమాల్ని మనస్సులో వుంచుకొని మాటాడుతున్న యీ మూడుదేశాలు, ఈక్రింది హెచ్చరికను గావించుతున్నాయి:

## నాజీ దుష్టులకు శిక్షణ

జర్మనీలో నెలకొల్పబడే ఏప్రభుత్వంతో గాని యుద్ధ విరామ సంధి జరిగినప్పుడు యీ క్రిందివిధంగా జరగాలి. పైన చెప్పిన దురంతాలకు, హత్యలకు, చిత్రవధలకు, బాధ్యులయిన లేక అంగీకారం చూపుతూ నేరంలో భాగస్తులయిన నాజీపార్టీ సభ్యులను, యితరులను, జర్మన్ ఆఫీసర్లను, ఆదాశసకృత్యాలు జరిగిన దేశాలకు పంపుతారు. నాజీచెరనుండి విముక్తి చెందిన ఆదేశాలలో స్థాపించబడే స్వతంత్ర ప్రభుత్వాల న్యాయశాస్త్రం అనుసరించి అక్కడ యీదుష్టులకు శిక్ష విధించబడుతుంది. ఈనేరస్థుల లిస్టులు సాధ్యమైనన్ని వివరాలతో,సోవియటుయూనియన్,పోలెండ్, జకోస్లోవేకియా, యుగోస్లోవియా, గ్రీసు, (క్రీటు ఇతరదీవులతోసహా)నార్వే, డెన్మార్కు, బెల్జియం, హాలండ్, లగ్జెంబర్గు, ఫ్రాన్సు, ఇటలీ మొదలగు అన్ని దేశాలలోనూ తయారు చేయబడుతాయి.

పోలిష్ ఆఫీసర్లను యావన్మందినీ కాల్చివేసినట్టియు, ఫ్రెంచి, డచ్ (హాలండు), బెల్జియం, నార్వే ఖైదీలను ఉరిదీసినట్టియు, క్రీటు రైతులను హత్యగావించినట్టియు, పోలండు ప్రజలను కసాయి వధలకు గురిచేసినట్టియు, ఈనాడు నాజీ దాస్యంనుండి విముక్తిచేయబడే సోవియటు ప్రాంతాలలో ఇదివరకు గావించిన దారుణహత్యలకు కారకులైనట్టి జర్మన్లు ఈ క్రింది విషయాన్ని గుర్తుంచుకోవాలి. అట్టి జర్మన్లు తాము నేరంచేసిన స్థలాలకు పంపివేయబడతారు. ఆ నేరము జరిగిన స్థలాలలోనే, వారి ఘోర కృత్యాలకు గురియైన ప్రజలే శిక్షించుతారు. "ఇంతవరకుఅమాయకప్రజలరక్తంతో తమచేతులు తడియని జర్మన్లారా! జాగ్రత్త! మీరుకూడ నేరస్తులతో చేరకండి."

ప్రపంచంలో యేమారుమూలలదాక్కున్నాసరే బయటికి లాగి యీనేరస్థులకు తగిన శిక్షవిధించడానికి మిత్రరాజ్యాలు కృతనిశ్చయంతో వున్నాయి. ఏప్రత్యేక భూభాగంలోనో నేరంచేయకపోయినా, నేరాలకు బాధ్యులగు జర్మన్లను మిత్రరాజ్య ప్రభుత్వాల సంయుక్త నిర్ణయాన్ని అనుసరించి శిక్షింపుతారు.



# రెడార్మీకి యింత శక్తి ఎక్కడిది?

## కామ్రేడ్ స్టాలిన్ జవాబు

★

ప్రపంచ ప్రజలకు స్వేచ్ఛాపరిపాలనా? లేక ఫాసిస్టుదాస్యమా? అనే భీకరసమస్యను రెడ్‌ఆర్మీ నేడు రష్యారంగంలో పరిష్కరిస్తోంది ప్రపంచచరిత్రలో యిదివరకెన్నడూ కని, విని యెరుగనంతటి పైశాచికహంతకులతో ఘోర సంగ్రామంచేస్తూ, నాజీలచే ఆక్రమించుకోబడ్డ కీలకస్థానాలన్నింటినీ, ఒకటి తరువాత మరొకదాన్ని, స్వాధీనంచేసుకొంటూంది. నాజీసేనల బలాన్ని తుత్తునియలు చేసి, హిట్లరుమూకల ప్లానులన్నింటినీ తలక్రిందుచేస్తోంది. మాతృదేశరక్షణకై త్యాగం చేయడమంటే యేమో ప్రపంచానికి చూపుతోంది. నాజీసేనలు యింతవరకు మనపడమటి సరిహద్దుమీదుగావచ్చి మన దేశాన్నికూడా తమ యినుపసంకెళ్ళలో బంధించలేకపోయారంటే, యిందుకుకారణం స్టాలిన్‌గ్రాడ్ రంగంలో రెడ్‌ఆర్మీ ప్రదర్శించిన చాకచక్యం, ధైర్యసాహసాలే నని చెప్పాలి. యూరపులో రెండోరంగం లేకపోయినప్పటికీ, ఒంటరిగానే రెడ్‌ఆర్మీ పోరుసల్పుతూ యిన్ని విజయాలు సంపాదిస్తూన్నదంటే, మానవజాతి చరిత్రలో దానిపాత్ర ఎంత ప్రాధాన్యత వహించిందో తెలుసుకొనవచ్చు.

ప్రపంచప్రజల స్వాతంత్ర్య సమరంలో యీ విధంగా నాయకత్వం వహిస్తూ, ఫాసిజం అనే పెనుభూతాన్ని నాశనంచేయగల శక్తి రెడ్‌ఆర్మీకి యెలా వచ్చిందో చూదాం.

## రెడ్‌ఆర్మీ కార్మిక-కర్షకుల సైన్యం

రెడ్ ఆర్మీకి, యితర సైన్యాలకు, చాలా తారతమ్యం ఉంది. కామ్రేడ్ స్టాలిన్ మాటలలో, "విముక్తిపొందిన - కార్మిక కర్షకుల సైన్యమే రెడ్‌ఆర్మీ. నవంబరు విప్లవం ద్వారా యేర్పడ్డ సైన్యం యిది. ఇదే శ్రామికవర్గ నియంతృత్వాన్ని కాపాడే సైన్యం." ప్రజాసామాన్యాన్ని అణచడానికి కాకుండా, స్వాతంత్ర్య మొసగడానికి, రెడ్‌ఆర్మీ ఏర్పడిందన్నమాట. చరిత్రలో యిదివరకెన్నడూ, ఏదేశంలోనూ, యిలాంటి సైన్యం లేదు.

రెడ్‌ఆర్మీయొక్క రెండో ప్రత్యేకతను గురించి కామ్రేడ్ స్టాలిన్ యిలా చెప్పాడు: "వలస దేశాల ప్రజల్ని దోచుకునే సైన్యాలకూ, మన సైన్యానికీ, చాలా తేడా వుంది. మనదేశంలో నివసించే వివిధజాతుల ప్రజలమధ్య అన్యోన్యతను పెంపొందించడంవల్లనే రెడ్‌ఆర్మీ నిర్మాణం యింతబలంగా వుంది. యిదివరలో (అనగా, జారుచక్రవర్తికాలంలో) అణచియుంచబడ్డ జాతులన్నింటికీ సంపూర్ణ స్వాతంత్ర్యం యిచ్చి కాపాడుతూన్నందుకే రెడ్‌ఆర్మీ యింతశక్తిని సంపాదించింది." అనగా, సామ్రాజ్యవాద దేశాలలోవలె, యితరుల స్వాతంత్ర్యాన్ని హరించడం ద్వారా కాదు, కాపాడడంద్వారా, రెడ్ ఆర్మీ బలపడింది.

కామ్రేడ్ స్టాలిన్ యింకా ఇలాఅన్నాడు: "రెడ్‌ఆర్మీ పుట్టినప్పటినుంచీ అది అంతర్జాతీయ సంప్రదాయంలో తరిఫీదు చేయబడింది. ఇతర దేశాల్ని గౌరవించే పద్ధతి దానికి అలవడింది. అన్నిదేశాల కార్మిక ప్రజాసామాన్యాన్ని రెడ్‌ఆర్మీ ప్రేమిస్తుంది." సామ్రాజ్య ప్రభుత్వాల సేనలకూ, రెడ్‌ఆర్మీకి, ఎంత వ్యత్యాసం ఉందో యిప్పుడు సులభంగా తెలుసుకోవచ్చు. 14 సామ్రాజ్య ప్రభుత్వాల సేనలతో హోరాహోరీ పోరు సల్పడంద్వారా రెడ్‌ఆర్మీ పుట్టిందనే విషయం పాఠకులుగుర్తించాలి. (1918-20)

## ప్రజల తోడ్పాటు

రెడ్‌ఆర్మీ విజయాలకు మరికొన్ని ప్రధాన కారణాలున్నాయి. మొదటిది, యుద్ధరంగానికి వెను తట్టునుండి సోవియటు ప్రజలు సర్వవిధాల తోడ్పడుతున్నారు. తుపాకులు, ఫిరంగులు, టాంకులు, విమానాలు, ఆహారపదార్థాలు, - ఏకధారగా యుద్ధరంగానికి రవాణా చేయబడతాయి. చనిపోయే సైనికులస్థానే రిజర్వుదళాలు విరివిగావచ్చి పోరుసల్పుతాయి. యుద్ధం ప్రారంభమయాక వందలకొద్దీ యుద్ధ పరిశ్రమలు దూరంగా, ఊరల్ పర్వతాల వైపుకు గొనిపోబడ్డాయి. ఇంతదూరం శత్రు విమానాలు ప్రయాణంచేసి దాడులుచేయడం అసాధ్యం. ఇవిగాక, కొత్త పరిశ్రమలెన్నో స్థాపించబడ్డాయి. పాతవి పునర్నిర్మించబడ్డాయి. నేడు సోవియట్ ప్రజలలో ఒకే ఒకభావం విహరిస్తోంది. వారినినాదం యిది: "అన్నివిధాల రెడ్‌ఆర్మీకి తోడ్పడాలి. విజయసాధనకై సర్వశక్తులు ధారపోయాలి." ఇంత ఉత్సాహంతో సోవియట్ ప్రజలు తమసర్వస్వం యుద్ధరంగానికి అర్పిస్తున్నారంటే, సోషలిస్టునిర్మాణం ఎంత గట్టి పునాదులపై కట్టబడిందో తెలుసుకోవచ్చు.

రెడ్‌ఆర్మీకి, సోవియట్‌ప్రజలకు, మధ్య అపూర్వమైన ప్రేమబంధం ఉంది. మంచుతో నిండిన ఉత్తరధృవంలో చూచినా, దక్షిణాన నల్లసముద్రపు ప్రాంతాలలోచూచినా, ప్రజలు తమ్ము బలపరుస్తున్నారనే విషయం ప్రతి రెడ్‌ఆర్మీ సైనికునికీ తెలుసు. తమ్ము కని, పెంచిన ప్రజలపై ఫాసిస్టురాక్షసులు గావించిన హత్యాకాండకు పతీకారం జరపాలనే పట్టుదలతో రెడ్‌ఆర్మీ పోరాడుతోంది.



## రెడ్‌ఆర్మీ చేసేది ధర్మయుద్ధం

రెడ్‌ఆర్మీ శక్తికి మరొకకారణం - విదేశ దురాక్రమణ దాడులనుండి దేశాన్ని రక్షించుకొంటూ చేసే ఈ యుద్ధం ధర్మయుద్ధమని ప్రతి రెడ్‌ఆర్మీ సైనికునికీ తెలుసు. కనుకనే రెడ్‌ఆర్మీ యింత అసమానమైన ధైర్యంతోను, అకుంఠితమైన చాకచక్యంతోను, పోరాడుతోంది. ఈ మధ్య జర్మన్లు కొత్తగా టైగర్‌టాంకుల్ని, ఫెర్డినాండ్ ఫిరంగుల్ని, రష్యారంగానికి దింపారు. వీటి సహాయంతో రెడ్‌ఆర్మీని సులభంగా నాశనం చేయవచ్చునని ఆశించారు. కాని, వీరి ఆశలు అడియాసలయాయి. ఒకచోట "గాండ్జా" అనేపేరుగల ఒక రెడ్‌ఆర్మీ యువకునికీ, ఒక టైగర్ టాంకుకూ, మధ్య ఎడతెగని పోరాటం జరిగింది. టాంకు రాక్షసివలె అతనివైపు దుముకుతూ వస్తోంది. టాంకుల్ని కాల్చి నాశనంచేసే రైఫిల్ అతనివద్ద వుందిగాని, మొదటిగుండు గురితప్పిపోయింది. టాంకు వడివడిగా ముందుకువస్తోంది. "గాండ్జా" చటుక్కున కందకంలో దూరాడు. పక్కగా టాంకు నడిచిపోయింది. ఈసారి దాన్ని యెలాగైనా ధ్వంసంచేయాలనే నిశ్చయంతో "గాండ్జా" టాంకుకు వెనుక గురిచూచి కాల్చాడు. కాని, యీసారికూడా గురి తప్పిపోయింది. టైగర్ వెనక్కు మళ్ళి, "గాండ్జా" వైపువస్తోంది. అతన్ని కందకంలో నొక్కేయాలని దానిఊహ. చటుక్కున "గాండ్జా" పొజిషన్ మార్చుకుని, టాంకును కిందిభాగంలో గురిచూచి కాల్చాడు. టాంకునిప్పంటుకుంది. మరఫిరంగులతో కట్టుదిట్టం చేయబడ్డ టైగర్‌టాంకు ఒక్క రెడ్‌ఆర్మీ సైనికుని చేతిలో నాశనమైంది.

## ముగింపు

1918 లో కామ్రేడ్ స్టాలిన్ ఒక మిలిటరీ నిపుణునితో మాట్లాడుతూ, యిలాచెప్పాడు: "ప్రతి తుపాకి వెనుక ఒకవ్యక్తి ఉంటాడుగదా! సైన్యాధికారి స్వాధీనంలో ఎన్నితుపాకులున్నప్పటికీ, వాటితో పోరాడేవ్యక్తులకు చక్కని రాజకీయ తరిఫీదులేకపోతే, అవన్నీ వృధాకాకతప్పదు. ఎక్కువ తుపాకులు ఉన్నప్పటికీ, విప్లవచైతన్యంగల శత్రువు యెదుట అవి యెందుకూ పనికిరానివౌతాయి" ఈవాక్యాలకు 'గాండ్జా' చక్కనిఉదాహరణ. కాని, నేడు రెడ్‌ఆర్మీకి విప్లవచైతన్యం మాత్రమేగాక, టాంకులు - విమానాలు - మరఫిరంగులు ఎన్నోఉన్నాయి. శత్రువుకంటె యెక్కువగా ఉన్నాయి. కార్మిక-కర్షకుల రెడ్‌ఆర్మీ కామ్రేడ్ స్టాలిన్‌నాయకత్వాన నాజీమూకల్ని కొద్దిరోజుల్లోనే యూరపునుండి తుడిచివేయగలదు. అట్టి శుభదినంకొరకు ప్రపంచంఅంతా ఎదురుచూస్తోంది.

—కంభంపాటి సత్యనారాయణ

## రెడ్‌ఆర్మీ సైనికుని ప్రతిజ్ఞ

సోవియట్ పౌరుడనైన నేను కార్మిక-కర్షకుల రెడ్‌ఆర్మీలో ప్రవేశించుతూ, గౌరవనీయుడుగాను, ధైర్యశాలిగాను, సుశిక్షణతో, మెలకువతో, పోరాడేవాడుగను, వుంటాను. మిలిటరీ రహస్యాలను, ప్రభుత్వ రహస్యాలను బైటపెట్టకుండా వుంటాను. మిలిటరీ నియమాలను, కమాండర్ల ఆజ్ఞలను జవదాటకుండా వుంటానని ప్రతిజ్ఞ చేస్తున్నాను.

నేను మిలిటరీజ్ఞానాన్ని చిత్తశుద్ధితో సంపాదిస్తాను: మిలిటరీ ఆస్తులను, జాతీయసంపదను అనిమేషుడనై, నిర్నిద్రతగా కాపాడుతాను. నా దేశప్రజలకు, సోవియట్ మాతృభూమికి, కార్మిక - కర్షక ప్రభుత్వానికీ, నా కంఠంలో కొనఊపిరి ఉండేదాకా బాసటగా నిలబడి పోరాడుతాను. నేను సోవియట్ యూనియన్‌కోసం, కార్మిక-కర్షక ప్రభుత్వంయొక్క ఆజ్ఞలు శిరసావహించుతాను. కూలీ - రైతుల రెడ్‌ఆర్మీలో చేరిన నేను నా మాతృదేశాన్ని, ధైర్యంతో, నేర్పుతో, గౌరవ ప్రతిష్ఠలతో సంరక్షిస్తాను - ఈ కర్తవ్య నిర్వహణలో నా రక్తం ధారపోయడానికి, ప్రాణం బలియివ్వడానికి వెనుదీయను. సోవియట్ ప్రజల శత్రులను నాశనం చేయడంలో నేను వెనుకాడను. నేను అన్యాయచేగాని, ప్రాణభీతిచేతగాని, యీ ప్రతినను భంగంచేసినట్లయితే, నామీద సోవియట్ చట్టాలప్రకారం శిక్ష విధించబడుగాక! నాప్రజలు, కార్మిక కర్షకలోకం, నన్ను అసహ్యించుకొనుగాక! నా సోదరులచేతిలోనే లజ్జాకరమైన మరణం పొందుదునుగాక!

# ఐక్యతలోనే అభివృద్ధి సాధ్యం

(6 వ పేజీ తరువాయి) ఎంతో వెనుకబడి వున్న ముస్లింజాతుల స్త్రీలు నేడు సోవియట్ పరిపాలనలో రాజకీయవేత్తలుగాను, డాక్టర్లుగాను, యింజనీర్లు, ఉపధ్యాయినిలు వ్యవసాయకులు, విమాన పైలట్లుగాను పని చేస్తున్నారు.

## విద్యాభివృద్ధి

సోవియట్ ప్రభుత్వం వివిధజాతుల కళలను, విజ్ఞానాన్ని, చదువును వృద్ధిచేయడానికి సర్వశక్తులా కృషిచేస్తూంది. అన్ని జాతీయరిపబ్లిక్కులలోనూ, యూనియనంతటా నిర్బంధ ప్రాథమిక విద్య ప్రవేశ పెట్టబడింది. బడికి పోయేవిద్యార్థుల సంఖ్య అజర్‌బైజాన్‌లో 35 రెట్లు, కజకస్థాన్‌లో 37 రెట్లు ఆర్మీనియాలో 68 రెట్లు, కిర్గీజ్‌లో 172 రెట్లు, వృద్ధిచెందింది. విప్లవానికి ముందు లిపిలేని భాషలకు లిపి కనిపెట్టబడింది. 1936 నాటికే సోవియట్ యూనియన్ పాఠశాలలలో 112 భాషలలో విద్య గరపబడేది.

విప్లవానికి ముందు రష్యన్ల కొరకు మాత్రమే కొలది విశ్వ విద్యాలయాలు, పరిశోధనాలయాలు వుండేవి. అనేక జాతులకు వాటిలో ప్రవేశమే వుండేదికాదు. నేడు బైలో రష్యాలో 22; అజర్‌బైజాన్‌లో 13, కజక స్థాన్‌లో 19 ఉన్నత విద్యాలయాలున్నాయి. యుక్రైన్‌లో ఉన్నతవిద్యాలయాల సంఖ్య 15 నుంచి 139 కి పెరిగింది. సోవియట్ యూనియన్‌లో ఉన్నత విద్యాలయాలలో చదువుతున్న విద్యార్థులసంఖ్య బ్రిటను, జర్మనీ, ఇటలీల ఉన్నత విద్యాలయాలలో చదువువారి సంఖ్యకుమూడు రెట్లు వుంది.

సోవియట్ అనుసరించుతున్న పాలసీవల్ల వివిధజాతుల ప్రజావిజ్ఞానం, కళలు యెంతో అభివృద్ధి చెందుతున్నాయి. ప్రజల కళాచాతుర్యం పెంపొందింది. వివిధజాతులకు చెందిన ప్రఖ్యాత రచయితల గ్రంథాలు సోవియట్ యూనియన్‌లోని అన్నిభాషలలోకి అనువదింపబడుతున్నాయి. ప్రజలందరిచేత అవి చదువబడుతున్నాయి. వివిధజాతుల విజ్ఞానం-కళలు సోవియట్ ప్రజలందరికి అందుబాటులో ఉంటున్నాయి. అంతేగాదు. ప్రపంచంలోని ప్రఖ్యాత రచనలన్నీ సోవియట్ భాషలలోకి తేబడుతున్నాయి. డార్విన్, మార్క్స్, షేక్స్పియర్, సెర్వాంటెస్, వగైరా రచయితల గ్రంథాలను సోవియట్ ప్రజలు చదువుతున్నారు. షేక్స్పియర్, చార్లీచాప్లిన్‌వంటివారి జన్మదినోత్సవాలను సోవియట్‌లో జరుపుతున్నారంటే, ఆ ప్రజల కళాభిరుచి ఎంత ఉన్నతమైనదో తెలుస్తుంది. ఈవిధంగా (మిగతా 11 వ పేజీ)

ఉజ్బెక్ స్త్రీలు



ముసుగుల్లో మురుగుట తప్పిపోయింది.
ఆనందంతో ఆధునిక యంత్రాల్ని నడుపుతున్నారు.

# సోవియట్ విదేశాంగ నీతి

(7వ పేజీతరువాయి) నినాదం ప్రజలలో ఎక్కువ బలపడసాగింది. ఫాసిస్టు అనుకూలురను మంత్రివర్గంలోనుంచితొలగించవలసివచ్చింది.

హిట్లరు ఆక్రమించిన దేశాల్లో ఫాసిస్టు వ్యతిరేక సంఘటన బయలుదేరింది. ఫాసిస్టులకు వ్యతిరేకంగా నిలబడి స్వాతంత్ర్యం కొరకు యుగోస్లోవియా, గ్రీక్ రాజ్యాలు యుద్ధం సాగించాయి. సోవియట్‌తో ఒడంబడికలు కావాలని బాల్కను ప్రజల ఆందోళన హెచ్చింది. బాల్టిక్ దేశాలు సోవియట్ విధానాన్ని అంగీకరించి సోవియట్ యూనియన్‌లో చేరిపోయాయి.

1941 జూన్ 22 వ తేదీన హిట్లర్ సోవియట్‌మీద దాడి ప్రారంభించాడు. ఇదివరకే యూరప్‌నంతా ఆక్రమించిన హిట్లర్ సోవియట్‌ను గూడా ఆక్రమిస్తే ప్రపంచంలోని అన్ని దేశాలకు, ప్రజలకు బానిసత్వం తప్ప మరేముంది?

25 సంవత్సరాలనుంచి కలలుగన్న సోవియట్ వ్యతిరేక యుద్ధం వచ్చేసరికి బ్రిటిష్, అమెరికన్ సామ్రాజ్యవాదులు సోవియట్ యూనియన్‌తో సహకార ఒడంబడికను చేసుకోవలసివచ్చింది. మరొకవిధంగాచేస్తే ఛాంబర్లేన్‌ను కూలద్రోసిన బ్రిటిష్ ప్రజలు ఊరుకునేవారు కారు.

నిజానికి యిటువంటి ఒడంబడిక (ఆంగ్లో-సోవియట్) 1939 లోనే వచ్చియున్నయెడల ఫాసిస్టులను అరికట్టి, యీయుద్ధంగూడా బయలుదేరి ఉండేది కాదని యిప్పుడు అందరూ అంగీకరిస్తారు. ఫాసిస్టు దురాక్రమణల అనుభవంవల్ల సామ్రాజ్యవాద ప్రభుత్వాల యిష్టం లేకపోయినా ప్రజల ఒత్తిడివల్ల సోవియట్ యూనియన్‌తో చేయి కలపాల్సి వచ్చింది.

## 41 జూన్ తరువాత

ప్రపంచ పెత్తనాన్ని సాధించి వివిధ దేశ ప్రజలను బానిసత్వంలో ముంచుటకు ఫాసిజం తయారయింది. దీనికి వ్యతిరేకంగా ప్రపంచ ప్రజలు యుద్ధాన్ని సాగిస్తూ, వారి దేశాల్లో ఫాసిస్టులను బలపరచే ముఠాలను అణచివేస్తూ వచ్చారు.

1917 నుంచి 1929 వరకూ యితర దేశములచే సోవియట్ రష్యా గుర్తించబడడమే కష్టమయింది. 1929 నుంచి 1941 వరకూ యితర దేశములతోపాటు సమానత్వాన్ని సంపాదించింది. 41 జూన్ తరువాత సోవియట్ ప్రభుత్వం ప్రపంచమంతా హర్షించే పోరాటాలను సాగిస్తూ, ప్రపంచ ప్రజలు యీనాడు సాగించే పోరాటంలో నాయకత్వస్థానాన్ని ఆక్రమిస్తోంది. 26 సంవత్సరాల సోషలిజంవల్ల సాధించిన అఖండ ఐక్యతతో పోరాడుతున్న సోవియట్ ప్రజలకు, యెర్రసైన్యానికి ప్రపంచప్రజలంతా జోహారులర్పిస్తున్నారు.

సామ్రాజ్యవాద ప్రభుత్వాలకు యిదంతా యిష్టమా? సోవియట్ యూనియన్ ప్రాబల్యం హెచ్చుతూంటే యిష్టంలేదని వారి ప్రవర్తనయే తెలియజేస్తుంది. కాని ఫాసిస్టులను త్వరగా ఓడించి, యుద్ధాన్ని అంతంచేసి, శాంతిని స్థాపించాలని కోరే ప్రపంచ ప్రజలందరి ఆందోళనవల్ల సోవియట్ ప్రభుత్వంతో బ్రిటన్, అమెరికా ప్రభుత్వాలు రోజురోజుకు గట్టి సంబంధాలు ఏర్పరుచుకొనక తప్పటం లేదు. దీనితోపాటు సోవియట్ వ్యతిరేక ముఠాలను, ఫాసిస్టు అనుకూలురను, తమ ప్రభుత్వములలో లేకుండా ప్రజలు చేస్తూ వచ్చారు. మిత్రమండలిలో చీలికలు తీసుకొని వచ్చుటకు ప్రయత్నిస్తున్న ఫాసిస్టుల ప్లానులను ప్రపంచ ప్రజల వత్తిడి భగ్నంచేస్తోంది. 1941 జూలైలోనూ, 1942 మేలోనూ సోవియట్ ప్రభుత్వం, బ్రిటన్, అమెరికాలు చేసుకున్న ఒడంబడికలు బలపడి మూడు రాజ్యాల మధ్య సంబంధాలు గట్టిపడ్డాయి.

## ప్రస్తుత సోవియట్ వైఖరి

ఫాసిస్టులను వీలైనంత త్వరలో నాశనం గావించి యుద్ధాన్ని అంతంచేయాలని ప్రపంచ ప్రజ లందరూ కోరుతున్నారు. ఫాసిస్టులు ఆక్రమించిన దేశాల్లోని ప్రజలు స్వాతంత్ర్యం కొరకు తహతహలాడుతున్నారు. ఫాసిస్టులను నాశనం గావించి యుద్ధాన్ని త్వరగా అంతం గావించుటయే నేటి ప్రధాన కర్తవ్యం. ఇదే ప్రపంచ ప్రజలందరి ఆశయం. ఇదే సోవియట్ ఆశయం గూడా.

స్వాతంత్ర్యంకోరే ప్రజలందరూ ఈవిధంగా సోవియట్ ప్రజలతో కలిసి యుద్ధాన్ని సాగిస్తూ రెండవరంగం కావాలని వత్తిడి ఎక్కువ చేస్తున్నారు.

తమ ప్రజలది రోజురోజు పైచేయికావడం చూచి, సామ్రాజ్యవాద ప్రభుత్వాలు తమ ప్రాబల్యం ఎక్కడ నశిస్తుందో అని ఆందోళన పడుతూ ప్రవర్తిస్తున్నాయి. రెండవరంగాన్ని ఆలస్యంచేయాలనివారుప్రయత్నించారు. ఇండియాకు జాతీయ ప్రభుత్వమిచ్చి ఫాసిస్టు వ్యతిరేక యుద్ధ నిర్వహణలోకి 40 కోట్ల భారతీయులను తీసుకొని వచ్చుటకు నిరాకరిస్తున్నారు. సోవియట్ యుద్ధానంతర వైఖరి ఏమిటో స్పష్టంగా లేదని అప్పుడప్పుడు ప్రకటనలు చేస్తారు; సోవియట్‌కువ్యతిరేకగా పోలెండు ప్రభుత్వంలాంటి విద్రోహకశక్తుల ప్రచారాన్ని బలపరచటానికి చూశారు. ముసోలినీ పతనం జరిగిన వెంటనే (1943 జులై 24) ఇటలీ ప్రజల స్వాతంత్ర్య తిరుగుబాట్లను గూడా తమ మిలిటరీ నిర్వహణతో జతకలుపుకొని త్వరగా హిట్లరును ఓడించుటకు ఉపేక్ష చేసారు. తమకు అనుకూలమైన ప్రభుత్వాలను స్థాపించుటకై (ఉ॥ బదోగ్లియో) కాలయాపన చేస్తారు. ఫ్రెంచి స్వాతంత్ర్యశక్తుల ప్రతినిధులను (ఉ॥ డిగాల్) మొదట గుర్తించలేదు. ఒకటికాదు. తమ ప్రాబల్యాన్ని నిలబెట్టుకోడానికి సామ్రాజ్యవాదులు ఎన్నో యత్నాలు చేస్తారు.

కాని ప్రయోజనం? స్వాతంత్ర్యపిపాసతో యుద్ధాన్ని త్వరగా అంతం చేయాలనికోరే ప్రపంచ ప్రజలు ఈ ఎత్తులను సహించకపోవుటవల్లఇది అన్ని యత్నాలు భగ్నమవుతున్నాయి ఇండియాలో జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పరచుటవల్ల ఫాసిస్టులను త్వరగా నాశనం చేయవచ్చునని 70 లక్షల కార్మికసభ్యులతో గూడిన బ్రిటిష్ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు తీర్మానించిది.

మిత్రమండలి విజయాలవల్ల హిట్లరు ఆక్రమితదేశాలు క్రమేణా ఒకటి తరువాత ఒకటి విముక్తి చెందుతున్నప్పుడు, ఆ దేశాలలో మిత్రమండలి అనుసరించవలసిన రాజకీయ వైఖరిని గురించి సోవియట్ ప్రభుత్వం స్పష్టపరిచింది. ఇటలీ అనుభవం అయిన తరువాత బ్రిటిష్ అమెరికన్ వైఖరిని తీవ్రంగా విమర్శించింది. ఆక్రమిత యూరప్‌లోని ప్రజల ఫాసిస్టు వ్యతిరేక తిరుగుబాట్లను మిత్రమండలి యుద్ధనిర్వహణతో సమన్వయ పరచినప్పుడే ఫాసిస్టులు త్వరగా నాశనం కాగలరని, అందువల్ల ఆయాదేశ ప్రజలు పూర్తిగా స్వాతంత్ర్య యుద్ధంలో పాల్గొనే అవకాశాలు కల్గించాలని, యుద్ధానంతర రాజ్యాంగముల విషయంలోకూడా ఆయా దేశముల ప్రజలకు పూర్తి స్వేచ్ఛ కల్గించాలని సోవియట్ పత్రికలు హెచ్చరిస్తున్నాయి.

అక్టోబరు 19నుంచి 30 వ తేదీ వరకూ జరిగిన త్రైరాజ్యసమావేశంలో సోవియటు విదేశాంగవైఖరిమరింతస్పష్టపడింది. ఫాసిస్టులను త్వరగానాశనం చేయుటకై చేయవలసిన యుద్ధ నిర్వహణనుగురించి అంగీకారం వచ్చింది. అనగా సామ్రాజ్యవాదుల కాలయాపన ప్రయత్నాలకు స్వస్తి చెప్పబడిందన్నమాట. ఇటలీలో పూర్తిగా ఫాసిస్టుల పలుకుబడిని నాశనంగావించి ఇటలీ ప్రజల సంపూర్ణ ప్రజాస్వామ్య హక్కులనుగుర్తించాలని, ఆస్ట్రియా ప్రజలను ఉత్తేజపరచుటకై వారి స్వాతంత్ర్యాన్ని గుర్తించాలని, తీర్మానించబడింది. యుద్ధానంతరం సోవియట్ వ్యతిరేక కూటములకు అవకాశం లేకుండా 1942 లోనే బ్రిటను, రష్యాలు అంగీకరించిన ఒడంబడిక తిరిగి పునరుద్ఘాటించబడింది. దానితో అమెరికా, చైనాలుకూడ యుద్ధానంతరం శాంతినికోరే రాజ్యాంగములలో కలిసి నిజమైన అంతర్జాతీయ సంస్థను ఒక దానిని ఏర్పరుచుటకు అంగీకరించబడింది. ఈ సమావేశ నిర్ణయాలన్నీ ప్రజలందరూ కోరే శాంతిని త్వరలో స్థాపించుటకు, ప్రజాస్వామ్య హక్కులను గుర్తించుటకు, సోవియట్ వ్యతిరేక ఆశయాలకు స్వస్తిచెప్పుటకు, ఉద్దేశించబడినాయి. ప్రపంచ మంతటా ఐక్యమవుతున్న ప్రజాశక్తులకు, ఇది మరొక విజయమని చెప్పవచ్చును. దీనివల్ల మిత్రమండలిలోని ప్రజల ఐక్యత మరింత బలపడిందని చెప్పవచ్చును.

## మన కర్తవ్యం

ఈవిధంగా సోవియట్ విదేశాంగ వైఖరి సోవియట్ యూనియన్ బలపడుటకేగాక, ఇతరదేశ ప్రజలందరికి లాభదాయకంగా ఉన్నప్పుడు, సోవియట్ ప్రజలవలె మనంగూడాఐక్యమయి ఫాసిస్టుల నాశనంచేసేమిత్రమండలి ప్రజల యుద్ధ నిర్వహణను బలపరుస్తూ, ప్రపంచ ప్రజల సహకారంతోబ్రిటిష్ ప్రభుత్వం నుంచి జాతీయ ప్రభుత్వం గుంజుకోవాలి. ప్రపంచ ప్రజలముందు సామ్రాజ్యవాదులు పరాజయాలు పొందుతున్నకొలదీ, మనంఇంకా ఎక్కువగాఐక్యమయి అట్లాంటిక్ ఛార్టర్ మనకుగూడా వర్తించేట్లు మనం కృషి చేయుటయే సోవియట్ విదేశాంగ వైఖరి మనకు చాటుతున్న విషయం.



# రెడ్ ఆర్మీ నవంబరుదే కానుక


## ★ కీవ్ విముక్తి ★

క్రీవ్‌పై తిరిగి ఎర్రజండా యెగురుతోంది. 26 వ నవంబరు విప్లవ వార్షికోత్సవం కీవ్ విజయవార్తవల్ల మరింత ఉత్సాహంతో జరుగుతోంది. జర్మను సైన్యాలకు స్థావరంగా ఉపయోగపడుతూ వచ్చిన వాటిలో యిది చాల ముఖ్యమైన పట్టణం. పారిశ్రామికంగా కూడ అత్యంత ప్రముఖస్థానం వహించింది. కీవ్ విముక్తితో, యుక్రెయిన్‌ను—అంతేకాదు నాజీ ఆక్రమిత సోవియటుభూమినియావత్తూ-నాజీ కిరాతకుల దాస్యంనుండి తప్పించేఅంతిమ ఘడియ సమీపించుతోంది.

కీవ్‌నుండి బగ్—నీస్టర్ నదులనంటి ముందుకుపోవడానికి రహదారి ఏర్పడింది. నీపర్ మలుపులోఛిన్నాభిన్నమై, తత్తరిల్లుతున్న జర్మను సేనలకు వలయం చుట్టబడుతూఉంది. ఒకవేళ ఆవలయం పూర్తికాక, ఎలాగో చావు తప్పి కన్ను లొట్టబోయిజర్మన్లు బ్రతికి బయటపడ్డా, కీవ్‌నుండి నైరుతిగా పోయే సైన్యాలు యింతకంటెపెద్ద వలయాన్ని పన్నగల్గుతాయి. కీవ్‌నుండి జితోమీర్‌కుపోయేరైలుమార్గంఇదివరకే గండిగొట్టబడింది. కీవ్‌కు నైరుతిగా వెళుతున్న రైలుమార్గంనుండి రెడ్‌ఆర్మీ ముందుకు సాగుతూంది. అప్పుడే 60 మైళ్లు పురోగమించింది

నీపర్‌మలుపులో క్రివాయ్‌రాగ్‌లోని జర్మన్ల తీవ్ర ప్రతిఘటన రోజురోజుకూ చావుదెబ్బలు తింటోంది. ఇక నీపర్ దిగువభాగంలోతూర్పువైపున పరిస్థితి చూద్దాం. జర్మను సైన్యాలను చుట్టుముట్టి ఎక్కడి కక్కడ రెడ్‌ఆర్మీ హతమార్చడం జరుగుతోంది.

దక్షిణాన క్రైమియా విముక్తి కూడ ప్రారంభమయింది. క్రైమియానుండి జర్మన్లు తప్పించుకుపోయే భూమార్గాలన్నీ కట్టుబడ్డాయి. పెరికోప్ సోవియట్ వశమవడమేగాక, పెరికోప్‌కు 40 మైళ్ళ పశ్చిమాన ఉన్న షాదోవుస్క్ కూడ వశమయింది. ఖెర్సన్‌కు ఎదురుగా 3 మైళ్ళలోని అలెస్కీని రెడార్మీ పట్టుకుంది. సోవియట్ ఫిరంగుల దెబ్బలకు ఇక ఖెర్సన్‌లోని జర్మన్లు తట్టుకోలేరు అందుకనే, అప్పుడే ఖెర్సన్‌ను విడిచి జర్మన్లు పారిపోతున్నారు. ఇదంతా ఎందుకు-నీపర్ డెల్టాకు దక్షిణంగా ఉన్న ద్వీపకల్పమంతా (నల్లసముద్రతీరం) రెడ్‌ఆర్మీ వశమయింది. పెరికోప్ నుండి సోవియట్ సైన్యాలు, క్రైమియా ముఖ్యపట్టమైన సింఫర్‌పోల్‌కు పోయే రైలురోడ్డు మార్గాల రెండింటి పైనా కాలుపెట్టాయి. ఇంతేగాదు. క్రైమియాకు తూర్పున కెర్చి జలసంధి దాటి పురోగమించు తున్నాయి. ఈ విధంగా క్రైమియా నాజీలపాలిటి మృత్యుగహ్వరమయింది. త్వరలోనే సెబాస్తపోల్ - 8 నెలల అసమాన సాహసంతో నిలబడిన సెవాస్తపోల్ పై తిరిగి ఎర్రజండా ఆడే సమయంఎంతో దూరానలేదు. 8—11—43




ఈ రెండుగీతల మధ్యభాగం గత సంవత్సరంలో నాజీల చెరనుండి విముక్తిచెందిన సోవియట్ భూ ప్రదేశం

# ఐక్యతలోనే అభివృద్ధి సాధ్యం

(10 వ పేజీ తరువాయి) సోవియట్‌లో ప్రపంచ సాహిత్యానికి, ప్రజా విజ్ఞానానికి నూతన పునాదులు నిర్మించబడుతున్నాయి.

## వివిధ జాతుల స్వాతంత్ర్యం

సోవియట్ యూనియన్‌లో వున్న అన్ని జాతులకు, తెగలకు రాజకీయంగాను, ఆర్థికంగానూ, వైజ్ఞానికంగాను సమాన హక్కులున్నాయి. సోవియట్ రాజ్యాంగం యీవిధంగా చెబుతూంది:

"ఏజాతికి, తెగకు చెందినప్పటికి, సోవియట్ పౌరులందరికి ఆర్థికంగాను, సామాజికంగాను, రాజకీయంగాను, సమానమైనహక్కులున్నాయి.

"ఈ హక్కులకు ఆటంకం కలిగించడం గాని సంకుచితపరచడం గాని సోవియట్ శాసనం ప్రకారం శిక్షార్హమవుతుంది."

16 యూనియన్ రిపబ్లిక్‌లకు అన్ని విషయాలలోను సంపూర్ణంగా సమానమైన హక్కులున్నాయి. ప్రత్యేకరాజ్యాంగచట్టాలున్నాయి. సోవియట్ యూనియన్‌నుంచి విడిపోయే హక్కు కూడ వుంది. దాని అంగీకారంమీద గాని ఒకరిపబ్లిక్ సరిహద్దులను మార్చడానికి వీలు లేదు.

సోవియట్ యూనియన్‌లో అన్నిటికంటే ఉన్నత రాజ్యాంగ సంస్థను, సుప్రీమ్ సోవియట్ అని పిలుస్తారు. దీనిలో సమానాధికారాలుగల రెండు సభలున్నాయి ఒకదానిని "యూనియన్ సోవియట్" అని పిలుస్తారు. దీనికి ప్రజలు సంఖ్యనుబట్టి ప్రతినిధులను ఎన్నుకొంటారు.

రెండోసభను జాతుల సోవియట్ (సోవియట్ ఆఫ్ నేషనాలిటీస్) అని పిలుస్తారు. దీనికి జనసంఖ్యతో నిమిత్తం లేకుండా ప్రతి యూనియన్ రిపబ్లిక్ 25 మంది ప్రతినిధులను పంపుతుంది. అటానమస్ రిపబ్లిక్ ఒక్కొక్కటి 10 మంది ప్రతినిధులను పంపుతుంది. అటానమస్ రీజియన్ 5 గురు ప్రతినిధులను, జాతీయ ఏరియా ఒక ప్రతినిధిని పంపుతుంది. జనసంఖ్యతో నిమిత్తంలేకుండా ప్రతినిధుల సంఖ్యను నిర్ణయించడం ద్వారా వివిధజాతులకు సమానావకాశాలు యివ్వబడ్డాయి.

బోల్షివిక్‌పార్టీ కామ్రేడ్ స్టాలిన్ నాయకత్వాన జాతులసమస్య యెడల యీ విధమైన పాలసీ నవలంబించడం వల్లనే సోవియట్ యూనియన్‌లో జాతివిద్వేషమనేది లేనేలేదు. స్టాలిన్ యిలా వ్రాసాడు: "జాతులమధ్య ద్వేషాన్ని రేకెత్తించడానికి దోపిడిచేసేవర్గాలు లేవు. పరస్పర అవిశ్వాసాన్ని, జాతీయోద్రేకాన్ని కలుగజేసే దోపిడియే అసలు రద్దుచేయబడింది. అన్ని రకాల పీడనకు వ్యతిరేకమైన కార్మికవర్గం చేతిలో ప్రభుత్వాధికారముంది. సోవియట్ ప్రజలలోని వివిధ జాతుల విజ్ఞానం, కళలు, దినదినాభివృద్ధి చెందుతున్నాయి. అందుచే వివిధ జాతుల మధ్య సంబంధాలే మారిపోయాయి. అవిశ్వాసం పోయి పరస్పర సుహృద్భావం, సౌభ్రాతృత్వం ఏర్పడింది. ఫెడరల్ రాజ్యాంగం క్రింద పరస్పరసహకారం పెంపొందింది.

"దీని ఫలితంగా అనేక జాతుల ప్రజలతో కూడిన సోషలిస్టు రాజ్యాంగాన్ని మనం నిర్మించగల్గాం. ఇది అనేక పరీక్షలకు నిలబడింది. సోవియట్ యూనియన్ యొక్క దృఢము, సుస్థిరమైన పునాదులను గాంచి ప్రపంచంలో మరి ఏప్రభుత్వమైనా అసూయ పడవలసివుంది." అని స్టాలిన్ అన్నాడు. ప్రస్తుతయుద్ధం స్టాలిన్ మాటలను అక్షరాలా రుజువుజేసింది.

ఈ సత్యాన్నే కృష్ణాపత్రిక అక్టోబరు 23 తేదీ సంపాదకీయంలో యిలా అంగీకరించింది: "రష్యాలో నున్నన్ని భిన్న జాతులు ఏరాజ్యంలోనూలేవు. ఆసియన్ సజాతులైన యూదీయులు, మంగోలియన్లు, కర్దులు, కకేషియన్లు, జార్జియన్లు లక్షలకొలది వున్నారు. మతాలు వేరు. భాష వేరు. ఆచారాలు వేరు. జాతి పుట్టకలే వేరు. అయినా ఇన్ని జాతులవారు ఒక్క రాజ్యాంగ కూటమిలో కలిసి మెలసి వున్నారంటే - ఆరాజ్యాంగంయొక్క మహత్తరమని చెప్పాలి... ఇప్పుడు రష్యాలో వున్నది ప్రజారాజ్యం. ఏజాతివారైనా, ఏప్రాంతస్థులైనా రష్యన్ రాజ్యాంగ కూటమిలో నుండి విడిపోవాలంటే, విడిపోవడానికి స్వేచ్ఛ వున్నది. అయినావారుతమ నమ్మకిమీదనే కూటంలో చేరి మమేకంగా ఉండడం రష్యన్ రాజనీతియొక్క మహత్తును చెప్పక చెప్పుతున్నది. రష్యన్ రాజనీతిజ్ఞులు మైనారిటీ సమస్యను అంత ఘనసంగా పరిష్కరించగల్గారన్నమాట.... రష్యామాత్రం ఒక్క సూత్రంతో జాతీయ సమ్మేళన సమస్యను పరిష్కరించి ప్రపంచానికంతకూ మార్గదర్శకం కాగల్గింది." (23-10-43 కృష్ణా పత్రిక సంపాదకీయంనుంచి)

సోవియట్ యూనియన్ చూపుతున్న ప్రత్యక్ష నిదర్శనాన్ని భారతదేశభక్తులంతా శ్రద్ధతో గమనించాలి. జాతీయవిభేదాలతోనూ, మత విభేదాలతోను కీచులాడుతూ మన స్వాతంత్ర్యోద్యమానికి చేస్తున్న అపకారాన్ని గుర్తించాలి సోవియట్ అనుభవాన్ని మన దేశానికి అన్వయించిచే జాతీయైక్యతను నిర్మించడం ఎంత సులభమో ఆలోచించాలి. స్వయంనిర్ణయహక్కును గుర్తించి, ముస్లింజాతులలో వున్న సందేహాలను తీర్చడం, అందరం కలసి స్వాతంత్ర్యం కొరకు ఐకమత్యంతో కృషిచేయడ, నేడు దేశభక్తులందరికి ప్రధాన కర్తవ్యమని తేటతెల్లం అవడం లేదా!

# రాష్ట్ర విద్యార్థి మహాసభ

రేపు 12, 13, 14 తేదీలలో, గుంటూరులో జరుగనున్న 19 వ ఆంధ్రరాష్ట్ర విద్యార్థి మహాసభకు ప్రారంభకులుగా మోహన్ కుమారమంగళంగారు కొన్ని అనివార్య కారణాలవల్ల రాజాలరనీ, వారిస్థానే అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి అయిన ప్రశాంత సన్యాల్ గారు ప్రారంభకులుగా వస్తున్నారనీ, ఆహ్వాన సంఘాధ్యక్షులు తెలియజేస్తున్నారు. మహాసభాధ్యక్షులు పుచ్చలపల్లి సుందరయ్యగారు. వైజ్ఞానిక సమస్యపై ఉపన్యాసాలిచ్చుటకు శ్రీ కాశీపట్నపు కొండయ్యగారు (ఎం. ఎస్. సి.). అడివి బాపిరాజుగారు (బి. ఏ., బి. ఎల్.). తాపీ ధర్మారావుగారు ఆహ్వానించబడ్డారు.

ప్రతినిధులందరూ 11 వ తేదీ రాత్రికే గుంటూరు చేరుకోవాలి.

# 2 లక్షల నిధి

## రశీదు పుస్తకాలు

పొలిటికల్ సర్క్యులరులో నవంబరు 15 వ తేదీకి రశీదు పుస్తకాలన్నీ తిరిగిపంపించివేయవలెనందిగ వ్రాశాం. అలా రాష్ట్ర కమిటీకి పంపించవలసినది పూర్తి అయిన రశీదు పుస్తకాలు మాత్రమే. పూర్తి కాని రశీదు పుస్తకాలు తాలూకా పార్టీ ఆఫీసులకు, తాలూకా కేంద్రాలు లేనిచోట్ల, జిల్లా ఆఫీసులకు చేర్చాలి. ఆపిమ్మట ప్రతి సెంటరు (ఒక స్థానికహోల్‌టైమరు చూచే ప్రాంతం) లో సెంటరు లేక సెల్లు కార్యదర్శి ఒక రశీదు పుస్తకాన్ని తమవద్ద పెట్టుకొని, పార్టీ నిధికి వసూలుచేసేకొద్దీ రశీదు లివ్వాలి.

(2 వ పేజీ తరువాయి) విరాళంగా యిచ్చింది. లండన్‌లో ఏర్పడ్డ రిలీఫ్‌కమిటీకూడా విరివిగా ధనం వసూలుచేసి పంపుతోంది. ఇలాగే చైనాలో కూడా జంగ్-తై-షేక్ సతి అధ్యక్షతకింద 12 లక్షల డాలర్లు (2 లక్షల రూపాయలు) బెంగాల్‌నిధికివసూలుచేయబడుతోంది.

ఈవిధంగా అన్నిదేశాల ప్రజలు భారతదేశం యొక్క ఆహార సమస్యను పరిష్కరించడంలో ముందుకు వస్తూంటే, యిటు మన దేశంలో ప్రధాన జాతీయ సంస్థలకు చెందిన దేశభక్తులు కేవలం ప్రభుత్వాన్ని దుమ్మెత్తిపోయడంతో సంతృప్తి చెందుతున్నారు. ఇది జాతీయ సాంప్రదాయంకాదు. మన దేశం, మన ప్రజలు, ప్రతిరోజూ కరువు రాకాసికి ఆహారి అవుతూంటే, చూస్తూ ఊరుకోవలసిందేనా? ఇతర దేశాల ప్రజలు మనపట్ల చూపే సానుభూతి అయినా మన దేశభక్తుల్ని కదల్చవద్దా? ఆహారసమస్యను పరిష్కరించుటకై రాజకీయపార్టీలన్నీ కలిసి పనిచేయవద్దా? ఎంతకాలం యీవిధంగా ఉపేక్షా భావంతో చేతులు ముడుచుకొని కూర్చుంటాం? 8—11—43

# స్టాలిన్ ఉపన్యాసం

(1 వ పేజీతరువాయి) క్షమింపరు. వీటన్నిటికి తగిన నష్టపరిహారాలను మనం కోరుతాం.

"మరొకమాట చెబుతున్నాను: ఈసంవత్సరం చాల ప్రధానమయింది. ఈ సంవత్సరంలో రెడార్మీ సాధించిన విజయాల ఫలితంగా, పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. మిత్రరాజ్యాలతో స్నేహ, సహకారాలు చాల బలపడ్డాయి. ఇందుకు నిదర్శనం మొన్న జరిగిన మాస్కో సమావేశం.

"అందరికీ సమానశత్రువులైన ఫాసిస్టుల పైని మిత్రమండలి విజయం మరింత దగ్గర పడింది. మిత్రరాజ్యాల్లో సంబంధం చెడుతుందనీ, మిత్రరాజ్యాల బలం సన్నగిలుతుందనీ శత్రువు ఊహచనా వేశాడు. కాని, జరిగింది తద్వ్యతిరేకం. మిత్రరాజ్యాల పరస్పర సంబంధం ఎంతో బలపడింది. మాస్కో సమావేశంలో జరిగిన చరిత్రాత్మక నిర్ణయాలే ఈ విషయాన్ని వేనోళ్ళ చాటుతున్నాయి. సోవియట్ యూనియన్, బ్రిటన్, యునైటెడ్ స్టేట్సు రాజ్యాల ప్రతినిధులు సమిష్టిగా జరిపిన నిర్ణయాలను ఇటీవలనే ప్రకటించాం. శత్రువుపై కడపటి చావుదెబ్బతీసి, విజయం చేపట్టడానికి మిత్రరాజ్యాలు కంకణం కట్టుకొని ఉన్నాయి.

## మిత్రరాజ్యాల తోడ్పాటు

"ఈ సంవత్సరం జర్మన్ ఫాసిస్టుసేనలపై రెడార్మీ తీసిన దెబ్బలకు, ఉత్తరాఫ్రికా, మెడిటరేనియన్, దక్షిణ ఇటలీ రంగాల్లో మిత్రరాజ్యాలు జరిపిన యుద్ధాలు తోడ్పడ్డాయి. ఆ దేసమయంలో జర్మనీలోని ముఖ్యపరిశ్రమ కేంద్రాలమీద మిత్రరాజ్యాలు పెద్ద ఎత్తున విమానదాడులు జరిపాయి. ఇంకా జరుపుతున్నాయి. వీటి ఫలితంగా శత్రువుయొక్క మిలిటరీశక్తి ఎంతోక్షీణించింది. ఇవి ఇలా ఉండగా, మిత్రరాజ్యాలు రెగ్యులర్‌గా యుద్ధ పరికరాలు సప్లయిచేస్తూవచ్చాయి. ఈవిధంగా మిత్రరాజ్యాలు అటు జరిపిన యుద్ధ చర్యలు, ఇటు పంపిన సప్లయిలు, మన వేసవి దండయాత్ర జయప్రదం కావడానికి ఎంతో తోడ్పడ్డాయి. ఇది అతిశయోక్తికాదు.

"దక్షిణయూరప్‌లో మిత్రరాజ్యాలు జరుపుతూన్న యుద్ధాలు రెండోరంగం అనిపించుకోలేవు - ఇది వాస్తవం. నిజమయిన రెండోరంగం ప్రారంభించడానికి యింకెంతోకాలం పట్టదు. దీనిని ప్రారంభించడం నాజీ జర్మనీపై పూర్తి విజయాన్ని చాల త్వరపరుస్తుందన్నవిషయం స్పష్టం. అంతేకాదు - మిత్రరాజ్యాల చెలిమి ఇంకా ఎంతోబలపడగలదు.

## దెబ్బతిన్న మృగం

"జర్మన్లిప్పుడు జరుపుతూన్న ఘాతుక చర్యలు చావుదెబ్బతిన్న క్రూరజంతువు ప్రవర్తనలా ఉన్నాయి. తమస్థితి విషమించి, ఆశలు అంతరిస్తున్న కొలదీ, అమానుషత్వం పెచ్చుపెరిగి, అత్యాచారాలు జరుపుతున్నారు. ఈ నరహంతకులు జరుపుతూన్న అత్యాచారాలను మనం మరచిపోము; వారికి తగినశాస్తి జరిపితీరుతాము.

## ఐదు కర్తవ్యాలు

"శత్రువు అంతు చూడ్డానికి మిత్రమండలి నిశ్చయించుకుంది. జర్మన్ పరిశ్రమ కేంద్రాలను మిత్రమండలి బాంబులతో ధ్వంసచేస్తూ, మన యుద్ధాలకు అనుకూల పరిస్థితులను కలిగిస్తూంది. ఈ చర్యలే రెండోరంగానికి దోవతీస్తాయని ఆశిస్తున్నాను.

హిట్లరు ప్రతికూల సమ్మేళనం సుస్థిరమైన పునాదులపైఆధారపడిఉంది. తూర్పున రెడార్మీ కురిపిస్తున్న అపజయాలు, పడమట మిత్రరాజ్యాలు తీస్తున్న దెబ్బలు జర్మనీని అప్పుడే విచ్ఛిన్నం చేస్తున్నాయి. ఇటలీ ఇదివరకే మూలపడింది. హిట్లరు పక్షంలోని ఇతర గ్రహాలుకూడా మెల్లమెల్లగా జారిపోడానికి తహతహలాడుతున్నాయి.

ఈ పరిస్థితుల్లో మిత్రరాజ్యాలు అయిదు కర్తవ్యాలను నెరవేర్చవలసి ఉంది.

—హిట్లరు దాస్యం నుంచి యూరప్ ప్రజల్ని విముక్తి పరచడం.

—ఇలా విముక్తి పొందిన ప్రజలకు, తమతమ ఇష్టానుసారంగా తమ దేశవ్యవహారాలను చక్కబెట్టుకోగల హక్కు, స్వాతంత్ర్యం ఇవ్వడం.

—అత్యాచారాలకు బాధ్యులయినవారందరినీ కఠినంగా శిక్షించడం.



మార్షల్ చుకోవ్

స్టాలిన్‌గ్రాడ్ యుద్ధంలోను, తరువాత శీతకాలయుద్ధంలోను రెడార్మీ ఎత్తుగడలను నిర్ణయించిన యోధుడు

—జర్మనీ మళ్ళీ దురాక్రమణకు ఒడికట్టకుండా చేయగల వ్యవస్థను యూరప్‌లో స్థాపించడం.

—జర్మన్ ఫాసిస్టుల పాలబడి పాడయిన ప్రదేశాలను పునర్నిర్మించడం కోసం ప్రజల్లో పరస్పర సహకారం శాశ్వతంగా నెలకొల్పడం.

## శత్రువుకు విరామం ఇవ్వకూడదు

రెడార్మీ యోధులు, సోవియట్ ప్రజలు, సాటిలేని విజయాలు సాధించారు. ఈ విజయాలను చూచుకొని మురిసిపోతూ, రెడార్మీ, సోవియట్ ప్రజ, ముందు కర్తవ్యాన్ని మరచిపోకూడదు. అంతిమవిజయం అంత సులభంగా లభించేదికాదు; ఇంకా తీవ్రమయిన యుద్ధాలు అవసరం అవుతాయి. విజయం వూడివచ్చి ఒడిలో పడదు. యుద్ధాలవల్లనే అది లభిస్తుంది. ఇప్పుడు విజయం సమీపంలోనే ఉంది. కాని, దానిని చేపట్టడానికి సర్వశక్తులను సమీకరించాలి. దృఢనిశ్చయంతో, చాకచక్యంతో, రెడార్మీ యుద్ధరంగంలో కృషి చేయాలి. వెనుకనున్న వారు స్వార్థత్యాగంతో తోడ్పడాలి.

మనం ఇంత సాధించాం. కాని, ఉన్న అవకాశాలనన్నిటిని వుపయోగించుకొని, అతిత్వరలో శత్రువును తుత్తునియలుచేయకపోతే, ఆక్రమిత యూరప్‌లోను, సోవియట్‌లోను, ఫాసిస్టు దాస్యాన్నింకా అనుభవిస్తున్న ప్రజలకు ఈ విజయాలన్నీ ఎందుకూ పనికిరాకుండా పోతాయి. విరామంలేకుండా శత్రువును తరిమికొడుతూ ఉండాలి; సర్వశక్తులను వినియోగించి శత్రువుకు చావుదెబ్బ తీయాలి.


శత్రువుకు ప్రాయశ్చిత్తం జరిగే రోజు దగ్గరపడుతూఉంది. మన మాతృదేశంలో శత్రువు పురుగు లేకుండా తుడిచివేయగలం అని ఇప్పటి యుద్ధదశనుబట్టి చెప్పగలం. బెల్లోరష్యా, ఉక్రేన్, క్రైమియా, లాట్వియా, ఎస్తోనియా, లిథువేనియా, మాల్దేవియా, కరిలియన్ - ఫిన్నిష్ రిపబ్లిక్కు - ఇవన్నీ శత్రు చెరనుంచి విముక్తిచెందగల సుదినం సమీపిస్తూంది.

పదండిముందుకు - విజయంచేపట్టండి!!

జర్మన్ దురాక్రమణదారుల్ని

హతమార్చండి!!

నీపర్ నదిని దాటివచ్చిన రెడార్మీ యోధులు



Printed and Published by Katragadda Rajagopala Rao at Prajasakti Press, Governorpet - Bezwada.

END OF ISSUE